ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 23 జూలై 2025

ఏడాదైనా.. అంతేనా..?

● అతీగతీ లేని మదనపల్లె ఫైల్స్ దహనం కేసు ● దర్యాప్తు ఆలస్యంపై ప్రజల్లో అనుమానాలు ● ఫ్రీహోల్డ్ భూముల భవితవ్యం ఏంటి?


కాలిపోయిన సబ్ కలెక్టరేట్‌లోని ఫైళ్లు (ఫైల్)

మదనపల్లె, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె ఫైల్స్ దహనం కేసు ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదు. ఈ సంఘటన జరిగి ఏడాది పూర్తయినా అతీగతీ లేదనే విమర్శలు ఉన్నాయి. గత ఏడాది జూన్ 21వ తేదీ ఆదివారం రాత్రి 10:40 గంటలకు సంఘటన జరగ్గా, గంట ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. మొదట్లో దీనిని విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిందని అధికారులు భావించారు. ప్రభుత్వం ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అప్పటి డీజీపీ ద్వారక తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యర్, రెవెన్యూ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా, ట్రాన్స్‌కో సీఎండీ సంతోష్‌రావు హెలికాప్టర్‌లో మదనపల్లెకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసు, విద్యుత్, అగ్నిమాపకశాఖ ఉన్నతాధికారులతో కలసి విచారణ చేపట్టారు. ఆరోజు సాయంత్రానికి ఇది యాక్సిడెంట్ కాదు..ఇన్సిడెంట్‌గా డీజీపీ, ఆర్‌పీ సిసోడియా ప్రకటించారు. ఈ క్రమంలో అప్పటి ఆర్డీవో హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ విభాగం చూసే సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్, పూర్వపు ఆర్డీవో ఎంఎస్ మురళి తదితరులపై కేసు నమోదు చేశారు.

ఈ సంఘటనలో రెవెన్యూకు సంబంధించిన వివిధ కీలకమైన ఫైళ్లు కాలిపోయాయి. దీనిపై అప్పట్లో టీడీపీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, ఇతర ప్రజాసంఘాలు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు వరుస ఆందోళన చేపట్టాయి. ఇదంతా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వారి అనుచరుల పనేనంటూ ఆరోపించాయి. అయిదేళ్ల వైసీపీ పాలనలో మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు ఏరియాలలో పెద్దిరెడ్డి కుటుంబం, వారి అనుచరులు ప్రభుత్వ, ప్రైవేటు భూములను దౌర్జన్యంగా ఆక్రమించారని పెద్దఎత్తున ఆందోళనలు చేశాయి. అలాగే 22ఏ, ఫ్రీహోల్డ్ భూములను స్వాధీనం చేసుకునే క్రమంలో రికార్డులు లేకుండా చేయడానికే దహనం చేయించారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఇందులో భాగంగా వారంరోజుల పాటు ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేసి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తర్వాత క్రమంలో ఈ కేసు తీవ్రత దృష్ట్యా ఆగస్టులో సీఐడీకి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.


మదనపల్లె సబ్ కలెక్టర్‌లో కాలిపోయిన రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, ఇతర అధికారులు (ఫైల్)

కీలకమైన ఫైల్స్ దహనం కేసులో సీఐడీ అధికారులు అధికారులు, రాజకీయ నాయకులు, అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఇందులోభాగంగా భూములకు సంబంధించిన కీలకమైన డాక్యుమెంట్లు, రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే బాధితుల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల ఆధారంగా కూడా విచారణ చేపట్టి కేసులు నమోదు చేశారు. ఇందులో సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్, పూర్వపు ఆర్డీవోలు ఎంఎస్ మురళి, హరిప్రసాద్, పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు వంకిరెడ్డి మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, పెద్దిరెడ్డి పీఏలు ముని తుకారాం, శశికుమార్, రామకృష్ణారెడ్డి, ఎస్.బాబ్‌జాన్‌లపై కేసు నమోదు చేశారు. తర్వాత సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్, వి.మాధవరెడ్డి, పూర్వపు ఆర్డీవో ఎం.ఎస్.మురళిని సీఐడీ పోలీసులు ఇప్పటికే అంచెలంచెలుగా అరెస్టు చేయగా, మిగిలిన వారిలో కొందరు బెయిల్‌పై, మరికొందరు అజ్ఞాతంలో ఉన్నారు.

ఏడాదిలో ఏం చేశారు..!

సంఘటన జరిగి ఏడాదైనా ఆ స్థాయిలో కేసులో పురోగతి లేదనే విమర్శలు ఉన్నాయి. ఇది యాక్సిడెంట్ కాదని, ఇన్సిడెంట్‌గా అధికారులు ప్రకటించారు. అయితే ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? దీనికి కారణమేంటి? కారకులెవరనే అంశాన్ని అటు పోలీసులు, ఇటు అధికారులు ప్రకటించలేదు. అయితే సంఘటన జరిగిన మొదట్లో మదనపల్లెకు విచ్చేసిన డీఐజీ కోయ ప్రవీణ్ స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ రెండు వారాల్లో ఎస్ఎఫ్ఎల్ నివేదిక వస్తుందని, సంఘటనపై స్పష్టత వస్తుందని అప్పట్లో మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కానీ ఆ విషయాన్ని ఇప్పటికీ అధికారులు, పోలీసులు స్పష్టం చేయలేదు. దీనిపై కూడా స్థానికుల్లో ఆందోళన, అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించిన సీఐడీ పోలీసులు.. రాయచోటి, తిరుపతి కేంద్రంగా ఇప్పటికీ అదే పని చేస్తున్నారు. కేసు పురోగతిలో భాగంగా రికార్డుల పరంగా అనుమానాలు, అపోహలను నివృత్తి చేసుకునే క్రమంలో అప్పుడప్పుడూ మదనపల్లెకు వస్తున్నారు..వెళ్తున్నారు. అయితే దర్యాప్తు మాత్రం వేగవంతంగా, సమర్థంగా జరగలేదని భూబాధితులు వాపోతున్నారు. అసలైనోళ్లు బాగానే ఉన్నా అధికారులు, ఉద్యోగులు బలైనట్లు స్థానికంగా విమర్శలు కూడా ఉన్నాయి.

ప్రతిష్ఠాత్మకమైనా.. పరిస్థితి ఇంతేనా?

ఫైల్స్ దహనానికి ప్రధాన కారణంగా భావిస్తున్న ఫ్రీహోల్డ్ పథకాన్ని ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టింది. మరోవైపు ఫ్రీహోల్డ్‌తో రిజిస్ట్రేషన్ అయిన భూములను కూడా తాత్కాలికంగా రిజిస్ట్రేషన్లకు బ్రేక్ వేసింది. ఈ క్రమంలో ఫ్రీహోల్డ్ అయిన భూములతో పాటు అప్పటి వరకూ నిషేధిత జాబితా (22ఏ) నుంచి తీసేసిన భూములపై కూడా విచారణకు ఆదేశించింది. ఇప్పటికీ ఆ భూముల భవితవ్యం ప్రశ్నార్థకంగానే ఉంది. ఇంతటి కీలకమైన భూరికార్డుల కేసుతో పాటు స్వయానా సీఎం చంద్రబాబునాయుడే ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కేసుగా చెబుతున్నారు. తర్వాత పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం కూడా అంత సీరియస్‌గా తీసుకోలేదనే అపవాదు కూడా ప్రజల్లో ఉంది.

తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్


తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

మదనపల్లె అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డుల గదిని, అందులో రికార్డులను పరిశీలించి కార్యాలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీజీఆర్ఎస్ ద్వారా, మండలంలో నిర్వహించిన రీసర్వే, రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై సాధించిన ప్రగతిపై ఆరా తీశారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, వీఆర్వోలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, సర్వే ఏడీ భరత్‌కుమార్, తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ బాల సుబ్రహ్మణ్యం, సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయమైన పరిహారం : జేసీ

మదనపల్లె టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం తట్టివారిపల్లె వద్ద జాతీయ రహదారి నిర్మాణంలో భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందిస్తామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో 28 మంది రైతులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తట్టివారిపల్లె వద్ద 3.28 ఎకరాలు జాతీయ రహదారి నిర్మాణానికి సేకరించాల్సి ఉందని, ఇందులో ఎక్కువ భాగం ప్రభుత్వ భూమి ఉందని, అందులో కొంతమంది ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. ఎన్‌హెచ్ఏఐ అధికారుల నుంచి ఎక్కువ ఒత్తిడి ఉందని సాధ్యమైనంత త్వరగా భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. రైతులు, ప్రజలు సహకరిస్తే వారికి ఎక్కువభాగం పరిహారం అందేలా ఆర్బిట్రేషన్ రాసి కలెక్టర్‌కు పంపుతామన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, సర్వే ఏడీ భరత్‌కుమార్‌రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ డిప్యూటీ మేనేజర్ భానుప్రతాప్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథుడి హుండీ ఆదాయం రూ.6.06 లక్షలు

నందలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): సౌమ్యనాథస్వామి ఆలయం హుండీని మంగళవారం లెక్కించగా రూ.6,06,780 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీని 40 రోజులకు సంబంధించి లెక్కించామన్నారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన్, భక్తులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టు డిపాజిట్లు రూ.2.24 కోట్లు

సౌమ్యనాథస్వామి అన్నదాన ట్రస్టు డిపాజిట్లు బ్యాంకు ఖాతాలో రూ. 2,24,13,591 ఉన్నట్లు ట్రస్టు అధ్యక్షుడు ఎద్దల సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం సౌమ్యనాథస్వామి అన్నదాన ట్రస్టు బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం శని, ఆదివారాలు అన్నదానం చేస్తున్నామని, మరొక రోజు కూడా భక్తులకు భోజనాలు ఏర్పాటు చేసేందుకు తీర్మానించినట్లు తెలిపారు. అన్నదాన సత్రంలో పనిచేస్తున్న వారికి జీతాలు పెంచామని, అన్నదాన ట్రస్టుకు భక్తులు సహకరించాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి శైలేంద్రనాథ్, కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, సభ్యులు గంటా వాసుదేవయ్య, జంగంశెట్టి వెంకటసుబ్బయ్య, పల్లె సుబ్రమణ్యం, సర్దార్ హుస్సేన్, మోడపోతుల రాము, లంకయ్యగారి సుబ్బరామయ్య పాల్గొన్నారు.

నర్సరీలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి

మదనపల్లె టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మొక్కలు విక్రయించే నర్సరీల యజమానులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి తెలిపారు. మంగళవారం మదనపల్లె మండలంలోని పలు నర్సరిలీను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీలకు లైసెన్స్ పరిమితి మూడేళ్లు మాత్రమే ఉంటుందని, తరువాత వాటిని రెన్యువల్ చేయించుకోవాలన్నారు. ప్రతి నర్సరీలో యజమానులు విత్తన కొనుగోలు రిజిస్టర్, సస్యరక్షణ చర్యల రిజిస్టర్ అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు కొనుగోలు చేసే మొక్కల వివరాలు, బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. జీ-15 రకం బొప్పాయి మొక్కలు పెంచినా, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మదనపల్లె ఉద్యానశాఖ అధికారి ఈశ్వర ప్రసాద్‌రెడ్డి, నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

మూడుపూటలా అన్నప్రసాదం

● ఆగస్టు 1 నుంచి ఒంటిమిట్టలో..
● టీటీడీ నిర్ణయం



6

పీలేరులో భౌబోయ్...

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు


కరపత్రాలను పంపిణీ చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఏడాది పాలనలోనే ఇది రుజువైందని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని గాంధీనగర్, కూచివారిపల్లె ఎంపీటీసీ ఖాదర్‌బీ ఆధ్వర్యంలో ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింత మెరుగైన పాలన అందించి 2029 ఎన్నికల్లో మరోసారి టీడీపీ జెండా ఎగిరేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఖాదర్‌బీ, సీనియర్ నాయకుడు గీతాంజలి రమణ, ముళ్లగూరి సుబ్రమణ్యంనాయుడు, దాసరి కళాధర్, వెంకటేశ్ నాయుడు, సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో జేబ్రాండ్లకు 500 మంది బలి

● యాక్టింగ్‌లో సినీ హీరోలను మించిపోయిన మిథున్‌రెడ్డి : టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూలై 22(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో జేబ్రాండ్ మద్యానికి 500 మంది బలి అయ్యారని, ఇందులో సాధారణ ప్రజలతో పాటు వైసీపీ కార్యకర్తలు కూడా ఉన్నారని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కాంలో అరెస్టు అయిన ఎంపీ మిథున్‌రెడ్డి యాక్టింగ్‌లో సినిమా హీరోలకు మించిపోయాడని, జైలులో నేల మీద పడుకున్నానని డ్రామాలు ఆడుతున్నాడన్నారు. మిథున్‌రెడ్డి అరెస్టుతో గత ఐదేళ్లలో కల్తీ మద్యం తాగి చనిపోయిన వారి ఆత్మలు శాంతిస్తాయన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో కల్తీ మద్యం తాగి 500 మందికిపైగా చనిపోయారని, అనుమానం ఉంటే పార్టీ కార్యాలయానికి వస్తే ఆధారాలతో సహా నిరూపిస్తానని తెలిపారు. గత ఐదేళ్లలో పెద్దిరెడ్డి కుటుంబం ప్రజాధనాన్ని దోచుకుని దాచుకుందన్నారు. ఎక్కడి నుంచో తంబళ్లపల్లెకు వలస వచ్చి అరాచకాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలకు పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తంబళ్లపల్లెలో ప్రశాంతత నెలకొందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు ముసుగులో తంబళ్లపల్లెలో మళ్లీ అరాచకాలు, గొడవలు చేయాలని చూస్తే వైసీపీ నాయకులు, మద్దతుదారులను నియోజకవర్గం నుంచి తరిమికొట్టి అడుగు పెట్టనీయమన్నారు. ప్రాజెక్టుల సందర్శనకు నియోజకవర్గానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై రాళ్ళ దాడి చేయించి, టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన పెద్దిరెడ్డి కుటుంబానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమను జగన్ రాళ్లసీమగా మార్చారని, హంద్రీ-నీవా గురించి పట్టించుకోకుండా వదిలేశాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హంద్రీ-నీవా కాంక్రీట్ లైనింగ్ పనులకు రూ.4800 కోట్లు కేటాయించి పనులు వేగంగా జరిగేలా చేశారన్నారు. ఫేజ్-2 కింద మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేసి హంద్రీ-నీవా జలాలతో కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నేతలు భజంత్రి రామాంజులు, కట్టా హరినాథ్, ఆది మూర్తి, రెడ్డెప్ప, సుబ్బినాయుడు, పాస్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థిని ఆత్మహత్య

● పనిఒత్తిడే కారణమంటున్న బంధువులు ● అస్సాంలోని కాలేజి హాస్టల్‌లో ఘటన


హేమలత (ఫైల్‌ఫొటో)


హేమలత మృతదేహం

ఎర్రగుంట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తికి చెందిన పీజీ గైనకాలజిస్ట్ విద్యార్థిని పడిగపాటి హేమలత (28) పని ఒత్తిడితో సోమవారం అస్సాంలోని కాలేజి హాస్టల్‌లో ఆత్మహత్యకు పాల్పడింది. పోట్లదుర్తికి చెం దిన లక్ష్మిరెడ్డి, లక్ష్మీదేవిల పెద్ద కుమార్తె హేమలత. లక్ష్మిరెడ్డి పాలవ్యాపారం చేస్తు న్నాడు. పెద్దకుమార్తె హేమలత అస్సాం రాష్ట్రంలోని బార్పేట జిల్లా ఫకృద్దీన్ ఆలీ అహ్మద్ మెడికల్ కాలేజీలో గైనకాలజీ రెం డవ సంవత్సరం చదువుతోంది. కోర్స్‌లో భాగంగా ఆసుపత్రిలో వర్కింగ్ డ్యూటీలో ఎక్కువ సమయాన్ని కేటాయించడం వల్ల మానసిక ఒత్తిడికిలోనై ఇబ్బందిపడింది. ఈ నేపథ్యంలో వైద్యులకు కూడా చూపించుకుని రెండు నెలల క్రితం మళ్లీ కాలేజీకి వెళ్లింది. అయితే పనిఒత్తిడి ఏమాత్రం తగ్గకపోవడం వల్ల విసిగిపోయిన హేమలత కాలేజీ హాస్టల్‌లో సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఆత్మహత్యకు గల కారణాలను కూడా ఆమె ఉత్తరం రాసినట్లు సమాచారం. కాలేజీ వారు దానిని దాచినట్లు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు అస్సాంకు బయలుదేరి వెళ్లారు.

పోట్లదుర్తిలో విషాదం

ఏడాది వ్యవధిలో పోట్లదుర్తికి చెందిన ఇద్దరు పీజీ గైనకాలజీ విద్యార్థినులు మృతి చెందారు. కర్ణాటకలోని మంగళూరులో పీజీ గైనకాలజీ ఫైనలియర్ చదువుతున్న సృజన 2024 జూన్ 21న అనారోగ్యంతో మృతి చెందింది. అలాగే ప్రస్తుతం హేమలత సోమవారం అస్సాంలోని కాలేజీలో ఆత్మహత్యకు పాల్పడటం తల్లిదండ్రులను, బంధువులను, గ్రామస్థులను కలచివేస్తోంది.

ఇద్దరు మంచి బాల్య స్నేహితురాళ్లు

సృజన, హేమలత ఇద్దరూ మంచి బాల్య మిత్రులు. చదువులో ఎప్పుడూ ముందంజలో ఉండేవారు. పోట్లదుర్తి నలంద హైస్కూల్‌లో కలిసి చదువుకున్నారు. సృజన హైదరాబాదు గాంధీలో ఎంబీబీయస్ ఫ్రీ సీట్ సంపాదించి పూర్తి చేసింది. కర్ణాటకలోని మంగళూరులో పీజీ గైనకాలజిస్ట్ చేస్తూ మూడో సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందింది. అలాగే హేమలత కూడా వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో ఫ్రీ మెడికల్ సీటు సంపాదించి పూర్తి చేసింది. అస్సాంలోని బార్పేట కాలేజీలో పీజీ గైనకాలజిస్ట్ సెకండియర్ చదువుతూ ఆత్మహత్యకు పాల్పడింది.

ప్రైవేటు ఆసుపత్రిలో రోగి మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆరోపణ
● గుండెపోటుతో మరణించాడంటున్న వైద్యులు
● ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన, పోలీసులకు ఫిర్యాదు


ఖాదర్ ఖాన్ మృతదేహం


వైద్యులతో వాగ్వాదం చేస్తున్న ఖాదర్‌ఖాన్ బంధువులు

పీలేరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం ఆసుపత్రిలో చేరిన ఓ వ్యక్తి హఠాన్మరణం చెందిన సంఘటన మంగళవారం పీలేరులో జరిగింది. మృతుడి బంధువుల కథనం మేరకు... కేవీపల్లె మండలం కేవీపల్లె గ్రామానికి చెందిన పి.ఖాదర్‌ఖాన్ (47) పీలేరులోని ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కడుపులో నొప్పిగా ఉండడంతో అతను స్థానిక మల్లెల గ్రౌండ్స్‌లోని శ్రీలక్ష్మీ ఆసుపత్రి నిర్వాహకుడు డా.రామాంజిని వైద్యం కోసం సంప్రదించాడు. కిడ్నీలో రాళ్ల కారణంగా కడుపునొప్పి వస్తోందని, వెంటనే ఆపరేషన్ చేయాలని, అందుకు తిరుపతి మార్గంలోని శశి ఆర్థో ఆసుపత్రిలో చేరాలని ఆయన సూచించడంతో ఖాదర్‌ఖాన్ ఆదివారం అక్కడ జాయిన్ అయ్యారు. అక్కడి వైద్యులు అతడికి సోమవారం మధ్యాహ్నం లేజర్ ఆపరేషన్ ద్వారా కిడ్నీలో రాళ్లు తొలగించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు తనకు కడుపులో నొప్పిగా ఉందని పలుమార్లు భార్య, తనను చూడడానికి వచ్చిన బంధువులకు చెప్పిన ఖాదర్‌ఖాన్ మంగళవారం మధ్యాహ్నం హఠాత్తుగా మృతిచెందాడు. అంత వరకు బాగా ఉన్న ఖాదర్‌ఖాన్ మృతి చెందాడన్న విషయం తెలుసుకుని అతడి బంధువులు, ట్రాన్స్‌కో సిబ్బంది పెద్దఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని, ఆపరేషన్ అయిన తరువాత కూడా అతనికి కడుపులో నొప్పిగా ఉందని, కడుపు ఉబ్బరంగా ఉందని వైద్యులకు తెలియజేసినా పట్టించుకోలేదని, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని పరిస్థితి అదుపు తప్పకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మృతి పట్ల తమకు అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. లేజర్ ఆపరేషన్‌లో ఎటువంటి ఇబ్బందులు ఉండవని, మంగళవారం మధ్యాహ్నం వచ్చిన గుండెపోటు కారణంగానే ఖాదర్‌ఖాన్ మృతి చెందాడని వైద్యులు శశిభూషన్ రెడ్డి, రామాంజి తెలిపారు. చికిత్స అందించడంలో తాము ఎటువంటి పొరపాటు గానీ, నిర్లక్ష్యంగానీ చేయలేదని వారు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించాలని ఖాదర్‌ఖాన్ బంధువులు పట్టుబట్టడంతో కేసు నమోదు చేసేందుకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

● జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్



మోడల్ స్కూల్‌లో వంటగదిని తనిఖీ చేస్తున్న జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్

కురబలకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్ పేర్కొన్నారు. మంగళవారం ముదివేడు సమీపంలోని మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అనంతరం వంటగదిని పరిశీలించి స్టాకు రిజిష్టర్‌ను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటుగా మంచి ఆహారం అందివ్వడం ఎంతో ముఖ్యమన్నారు. ఒకప్పుడు హాస్టల్స్‌లో కనీస వసతులు లేక ఎంతో ఇబ్బంది పడేవారని, ప్రస్తుతం ప్రభుత్వం అనేక వసతులను కల్పిస్తోందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థి నిర్ధిష్ట లక్ష్యంతో ముందుకెళ్లి జీవితాన్ని సవాల్‌గా తీసుకుని మంచి ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్ళి విజయాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధనంజయులు, ఆర్‌ఐ శేషాద్రిరావు, ఎంఈఓ ద్వారకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఒకరి అరెస్ట్



పోలీసుల అదుపులో సుబ్రహ్మణ్యం

నందలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నందలూరు పీఎస్ క్రైం నంబరు 191/2020 కేసులో ఏ-3 నిందితుడు రాజంపేట మండలం రేణింతల అరుంధతివాడకు చెందిన పాటూరు సుబ్రహ్మణ్యం అలియాష్ మణిని అరెస్ట్ చేసి తిరుపతి ఆర్‌ఎస్‌ఎస్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం కేసులో ముద్దాయిగా ఉండి కోర్టు వాయిదాలకు హాజరు కానందున కోర్టు అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇచ్చినందున అతన్ని తాను తమ సిబ్బంది పట్టుకుని తిరుపతి స్పెషల్ ఆర్‌ఎస్‌ఎస్ కోర్టులో హాజరుపరచగా సదరు కోర్టువారు రిమాండ్ నిమిత్తం రాజంపేట సబ్‌జైలుకు పంపించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సిద్దవటం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె గ్రామ సమీపాన రైల్వేటాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి(50) మృతదేహం లభ్యమైంది. మంగళవారం రైల్వేస్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు కడప రైల్వే ఎస్‌ఐ సునీల్‌కుమార్ సూచన మేరకు పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సుభాన్ మాట్లాడుతూ నాలుగు రోజుల కిందట మృతిచెందినట్లుగా ఉందని, ఇతని ఆచూకీ కోసం విచారిస్తున్నామని తెలిపారు. రైల్లో ప్రయాణించేటప్పుడు ప్రమాదవశాత్తు కిందపడ్డాడా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని అన్నికోణాల్లో విచారిస్తున్నామన్నారు. మృత దేహాన్ని కడప రిమ్స్‌కు తరలిస్తున్నామన్నారు.

మదనపల్లె పంచాయతీ కార్యదర్శి బదిలీ

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ కార్యదర్శి ఎ.మాధవిని కర్నూలు జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. భార్యా భర్తల వర్గీకరణ కింద ఆమె చేసుకున్న దరఖాస్తున్న ప్రభుత్వం ఆమోదించి అంతర్ జిల్లా బదిలీకి సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు తగు చర్యలు తీసుకునేందుకు పంచాయతీ రాజ్ కమిషనరును అనుమతిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం ఆదేశాలలు జారీ చేశారు.

ఆడుదాం ఆంధ్ర ఖర్చుల వివరాలు ఇవ్వండి



సబ్‌కలెక్టరేట్‌కు లేఖ అందిస్తున్న విజిలెన్స్ సీఐ శివన్న, డీసీటీఓ

మదనపల్లెటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ఏడాదిన్నర కిందట నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఖర్చులు, వివరాలు ఇవ్వాలని కడప విజిలెన్స్ సీఐ శివన్న సబ్‌కలెక్టరేట్ డీఏఓ నిర్మలదేవిని కోరారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో డీఏఓను కలిసిన సీఐ, విజిలెన్స్ డీసీటీఓ గీతావాణి పలు అంశాలపై చర్చించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ఎంత మంది క్రీడాకారులు పాల్గొన్నారు, ఎక్కడెక్కడ క్రీడలు నిర్వహించారు, ఒక్కో క్రీడాకారుడికి ఎంత ఖర్చు పెట్టారని వివరాలు అడిగారు. వీటిపై త్వరలో వివరాలు పంపానాలని కోరారు.

పీలేరులో భౌబోయ్...

● గుంపులుగా తిరుగుతున్న శునకాలు

● బడి పిల్లల తల్లిదండ్రుల ఆందోళన

● ద్విచక్ర వాహనదారుల్లోనూ భయం.. భయం



పీలేరు-మదనపల్లె మార్గంలో వాహనం వెంటపడుతున్న కుక్కలు

పీలేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో గ్రామసింహాలు యథేచ్ఛగా స్వైరవిహారం చేస్తున్నాయి. పట్టణంలోని ఒక ప్రాంతం అని కాకుండా ఎక్కడ చూసినా గుంపులుగా దర్శనమిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రి వేళల్లో మహిళలు, పిల్లలు బయటకు రావాలంటే భయపడిపోతు న్నారని, వీధిలోకి రావాలంటే శకునం చూసే రోజులు పోయి శునకం చూసే రోజులు వచ్చాయని పలువురు స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వెంటపడుతున్న శునకాలను చూసి ద్విచక్ర వాహనదారులు కూడా భయపడుతున్నారు.

పెరిగిన కుక్కల సంతతి

పీలేరు పట్టణంలో చికెన్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్ల సంఖ్య పెరిగి పుష్కలంగా ఆహారం దొరుకుతుండడంతో వీధి కుక్కల సంతతి ఇటీవల విపరీతంగా పెరిగింది. దాదాపు గొర్రెల మందల్లా అవి పట్టణంలోని అన్ని ప్రధాన రోడ్లలో కనిపిస్తున్నాయి. మనుషులపైకి, వాహనాలపైకి అవి ఎగబడుతున్నాయి. దీంతో పాదచారులు, ఇటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని ఎల్‌బీఎస్ రోడ్డు, ఎస్వీ డీలక్స్ రోడ్డు, బీవీ రెడ్డి కాలనీ, ఆర్టీసీ పాత బస్టాండులు, నాగిరెడ్డి కాలనీ, ఆర్టీసీ నల్లగుట్ట, చెన్నారెడ్డి కాలనీ, అజంతా టాకీసు మిట్ట, యల్లమంద క్రాస్ ప్రాంతాల్లో కుక్కల విహారం ఎక్కువగా ఉంటోంది. వాటి సంచారం పెరిగిన కొద్దీ అవి మనుషుల మీద చేస్తున్న దాడులు పెరుగుతున్నాయి. తమ ఆసుపత్రికి ప్రతిరోజూ రెండు కుక్క కరిచిన కేసులు వస్తున్నాయని పీలేరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి రాని కేసులు రోజుకు మరో నాలుగు ఉంటాయని పలువురు విశ్రాంత ఉద్యోగులు తెలిపారు.



పీలేరులోని ఎస్వీ డీలక్స్ రోడ్డులో కుక్కల గుంపు

ఇంటికి తిరిగి వచ్చే వరకు భయమే...

పీలేరు పట్టణం విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందుతుండడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని చాలామంది పిల్లలను పట్టణంలోని పలు పాఠశాలలు, ట్యూషన్ సెంటర్లలో తమ పిల్లల్ని చేరుస్తున్నారు. తరగతులను బట్టి ఆయా విద్యార్థులకు ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల ఉదయం ప్రత్యేక తరగతులు ఉంటుంటాయి. కుక్కల కారణంగా ఆయా సమయాల్లో పిల్లల్ని ఒంటరిగా పంపాలంటే భయంగా ఉంటోందని పలువురు స్థానికులు పేర్కొన్నారు. గతంలో మాదిరి అవి మనుషులు, అదిరింపులకు భయపడడం లేదని, ఎంత అదిరించినా అవి పైపైకి వస్తున్నాయని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

శాశ్వత చర్యలు చేపట్టాలి

గతంలో కుక్కల సంతతిని నియంత్రించడానికి వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించేవారు. అందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఆ పద్ధతికీ మంగళం పాడారు. ప్రస్తుతం పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ కుక్కలను పట్టుకున్నా వాటిని తీసుకెళ్లి భాకరాపేట అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నారు. అటు వైపు తిరుపతి ప్రాంతంలో పట్టిన కుక్కలను సైతం అక్కడే వదిలేస్తున్నారు. దీంతో అవి కొన్ని రోజులు అక్కడ ఉండి మళ్లీ తమ పాత ఊళ్లకు చేరుకుంటున్నాయి. దీంతో వాటి సమస్య తాత్కాలికంగా సమిసిపోయినట్లు కనిపించినా మళ్లీ విజృంభిస్తోంది. వాటి నియంత్రణకు ప్రభుత్వం ఏదైనా శాశ్వత చర్యలు చేపట్టాలని పీలేరు ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే కుక్కలు పట్టుకుంటాం

● లతీఫ్ ఖాన్, పీలేరు పంచాయతీ ఇన్‌చార్జ్ ఈవో

పీలేరులో కుక్కల సమస్య ఎక్కువైనట్లు ఇటీవల మాకు కూడా ఫిర్యాదులు వచ్చాయి. వాటిని బంధించేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకున్న వారు కావాలి. అటువంటి వారి కోసం విచారిస్తున్నాం. త్వరలోనే వారిని పీలేరుకు పిలిపించి పట్టణంలోని కుక్కలను బందిస్తాం.

పుంగనూరు విలీనం వాయిదా ?

● మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల తరువాతే విలీనం ప్రక్రియ

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో పుంగనూరు నియోజకవర్గాన్ని విలీనం చేసే ప్రక్రియ వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వం నేరుగా ప్రకటన చేయకపోయినా మంగళవారం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు ఈ వాదనకు బలం చేకూరుతోంది. రాజంపేట పార్లమెంటు పరిధిలోని పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కాకుండా చిత్తూరు జిల్లా పరిధిలోకి అప్పటి వైసీపీ ప్రభుత్వం చేర్చింది. పార్లమెంటు పరిధిలోని మిగిలిన ఆరు నియోజకవర్గాలతో కలిపి అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాజంపేట పార్లమెంటు పరిధితో అన్నమయ్య జిల్లాను విస్తరించాలనే యోచనతో పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె డివిజన్‌లోకి మారుస్తూ మే 22న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మార్పులపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోగా అన్నమయ్య, చిత్తూరు జిల్లాల కలెక్టర్లకు రాతమూలకంగా పంపుకోవాలని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో సూచించింది. ఈ గడువు జూన్ 30వ తేదీతో ముగిసింది. అయినా ప్రభుత్వం విలీన ప్రక్రియను చేపట్టలేదు.

పుంగనూరు నియోజకవర్గంలోని పులిచెర్ల మండలానికి చెందినవారు మాత్రం ఈ విలీనంతో విభేదించారు. ఆ మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు. కొత్త ప్రతిపాదన ప్రకారం అన్నమయ్య జిల్లాలోనే కాకుండా ఇప్పుడున్న చిత్తూరు జిల్లా నుంచి కూడా పులిచెర్ల మండలాన్ని వేరు చేసి తిరుపతి జిల్లాలో చేర్చాలని అక్కడి నాయకులు పట్టుబట్టారు. ఈ డిమాండుపై తర్జనభర్జనలు పడుతున్న నేపథ్యంలో నోటిఫికేషన్ గడువు ముగిసి నెల రోజులైనా పుంగనూరు నియోజకవర్గంలోని మండలాలను అన్నమయ్యలో విలీనం చేసే ప్రక్రియ కొనసాగలేదు. ప్రభుత్వం ఈ అంశాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు సమాచారం. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల పరిధులకు సంబంధించి సరిహద్దులపై ప్రజల డిమాండ్లను పరిశీలించి తగు సిఫారసులు చేసేందుకు ప్రభుత్వం మంగళవారం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా, డివిజను, మండల కేంద్రాలకు ప్రస్తుతమున్న దూరాభారాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలని, సరిహద్దుల విషయంలో చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక అంశాలను సమీక్షించాలని, వీటన్నిటిలో సమతుల్యత పాటించే విధంగా అధ్యయనం చేసి తగు సూచనలు చేయాలని ప్రభుత్వం ఉపసంఘానికి సూచనలిచ్చింది. ఈ దశలో పుంగనూరు విలీనం అంశం, అందులో పులిచర్ల మండలాన్ని తిరుపతి జిల్లాకు మార్చే అంశాల విషయం మంత్రివర్గ ఉపసంఘం పరిధిలోకి వస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తం అన్ని జిల్లాల్లో వున్న వేర్వేరు డిమాండ్లతో పాటు పుంగనూరు విలీన ప్రక్రియను కూడా ఉపసంఘం పరిశీలనకు పంపి దాని సిఫారసుల ఆధారంగా తదుపరి ప్రక్రియను చేపట్టేందుకు నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే నెల రోజుల క్రితమే నోటిఫికేషన్ ప్రకారం గడువు ముగిసినా విలీన ప్రక్రియ ముందుకు సాగలేదని కూడా అంటున్నారు.

చోరీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఏఎస్పీ

● 9 తులాల బంగారం స్వాధీనం



వివరాలు తెలియజేస్తున్న ఏఎస్పీ మనోజ్‌హెగ్డే

ఓబులవారిపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చోరీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ మనోజ్‌హెగ్డే తెలిపారు. చోరీకి గురైన 9 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు మంగళవారం ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో నిందితులను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏఎస్పీ ఆ వివరాలు వెల్లడించారు. జూలై 14న చిన్నఓరంపాడు పంచాయతీలోని సీవో కమ్మపల్లె దళితవాడలో ఉంటున్న బొమ్ము ఈశ్వరమ్మ పక్కనే ఉన్న కిరాణా కొట్టుకు ఇంటికి తాళం వేయకుండా వెళ్లింది. అంతలోనే ఈశ్వరమ్మ బంధువులు అయిన రమాదేవి, రామసుబ్బమ్మ ఈశ్వరమ్మ ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను దొంగలించారు. సుమారు 9 తులాల నగలను దొంగలించి పక్కనే ఉన్న తమలపాకు తోటలో దాచిపెట్టారు. ఈనేపథ్యంలో 22వ తేదీ రాజంపేటలో అమ్ముకునేందుకు వెళుతుండగా పోలీసులు రెక్కీ నిర్వహించి పట్టుకున్నారు. రెండు బంగారు గాజులు, ఒక చైను, ఒక జత చెంప సరాలు, ఒక గుండ్ల బ్రాస్‌లెట్, ఒక చైను, ఒక ఉంగరం, ఒక జత మాటీలు, ఒక నెక్లీసు ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యుటేషన్ మరో ఏడాది పొడిగింపు

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా లైవ్ స్టాక్ అధికారి డెప్యుటేషన్ గుడువును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జిల్లా లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ సంస్థలో ఈవోగా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఎస్.పెంచలరాజు ఐదో సంవత్సరం కూడా గడువు పొడిగించింది. ఈ ఏడాది జూలై 16 నుంచి 2026 జూలై 15వ తేదీ వరకూ ఈ డెప్యుటేషన్ గడువు వర్తిస్తుందని పేర్కొంటూ పశుసంవర్థక, డైరీ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఈ మేరకు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

హెల్త్ సూపర్‌వైజర్‌పై విచారణ

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వేముల రమేష్‌పై విచారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2022 ఆగస్టు 20వ తేదీన లంచం తీసుకుంటుండగా ఏసీబీకి రమేష్ పట్టుబడ్డాడు. అప్పటి నుంచి ఈ కేసు విచారణకు నోచుకోకుండా మరుగున పడింది. 2024 ఆగస్టు 9న ఆ తరువాత ఈ ఏడాది మే 28 ఏసీబీ డైరెక్టర్ జనరల్ రమేష్ కేసుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి తగు చర్యల కోసం అందజేశారు. దరిమిలా దీనిపై విచారణ జరపాల్సి వున్న కారణంగా ప్రాథమికంగా నిందితుడు రమేష్ నుంచి వివరణ కోరుతూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి 10 రోజుల్లోగా తన వైపు వివరణలు సమర్పించాలని ఆదేశిస్తూ ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల హోస్‌మణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బుద్ధుని కొండలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

● ప్రభుత్వ భూమిగా ప్రకటించిన రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు

మదనపల్లెఅర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిశెట్టిపల్లె గ్రామం సమీపంలోని బుద్ధుని కొండలో మంగళవారం పోలీసులతో కలిసి రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గ్రామ రెవెన్యూ సర్వేనెంబరు 15లో సుమారు 75 ఎకరాల ప్రభుత్వ గయాల భూమి ఉందని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలోకి ఎవ్వరూ ప్రవేశించరాదని, ఎలాంటి కట్టడాలు నిర్మాణాలు చేపట్టరాదని, అతి క్రమించి కట్టడాలు కట్టిన ఎడల చట్టప్రకారం శిక్షార్హులని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బుద్ధుని కొండపై కొద్దిరోజులుగా పోలీసుల పికిటింగ్ ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు కొండపై కూసాలతో పిన్సింగ్ వేశారు. కార్యక్రమంలో తాలుకా పోలీసుల తోపాటు వీఆర్వో నారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

ఒంటిమిట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటిమిట్ట, మంటపంపల్లె, కొత్తమాధవరం ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలలను తనిఖీ నిర్వహించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. డొక్కా సీతమ్మమధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వంట ఏజెన్సీ వారు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఒంటిమిట్ట ప్రధానోపాధ్యాయులు రవీంద్రకుమార్, మంటపంపల్లె ప్రధానోపాధ్యాయులు ఐజయ్య, కొత్తమాధవరం ప్రధానోపాధ్యాయులు అంబేద్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ షంషుద్దీన్

రామ భక్తులకు మూడు పూటలా అన్నప్రసాదం

● రూ.4.35 కోట్ల అన్న ప్రసాదానికి మంజూరు ● ఆగస్టు 1 నుంచి అమలు



ఒంటిమిట్ట కోదండరామాలయం

భక్తులకు ఎంతో ఉపయోగం



ఒంటిమిట్ట కోదండరామాలయానికి వచ్చే భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలను పంపిణీ చేయడం ఎంతో ఉపయోగకరం. దూర ప్రాంత భక్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

- మేకపాటి నందకిశోర్‌రెడ్డి, ఒంటిమిట్ట

నిధుల కేటాయింపు సంతోషకరం



రామ భక్తులకు నిరంతరం అన్న ప్రసాదాలను పంపిణీ చేసేందుకు నిధులు కేటాయించడం సంతోషకరం. రాత్రి వేళల్లో భోజనం లభించక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిరంతరాయ అన్న ప్రసాద పంపిణీతో భక్తుల అవస్థలు తీరుతాయి.

- పసుపులేటి సుబ్బరాయుడు, ఒంటిమిట్ట

ఒంటిమిట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరాముని భక్తులకు టీటీడీ తీపి కబురు అందజేసింది. భక్తులకు ఆకలి తీర్చడానికి మూడు పూటలా అన్న ప్రసాదాలను పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం టీటీడీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఒంటిమిట్ట రామ భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలను పంపిణీ చేసేందుకు రూ.4.35 కోట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కేటాయించినట్లు తెలిపారు. దీంతో రామ భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2016లో ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం టీటీడీలో విలీనం చేసింది. ఆలయ అభివృద్ధి కోసం సుమారు వంద కోట్లను టీటీడీ కేటాయించింది. ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు చేస్తుంది. మూడు సంవత్సరాల క్రితం రామ భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేయాలని నిర్ణయించి ప్రతిరోజు మధ్యాహ్నం సమయంలో అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. ప్రతిరోజు సుమారు 500 మంది భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. టీటీడీ వారు కేవలం మధ్యాహ్నం మాత్రమే అన్న ప్రసాదం పంపిణీ చేస్తుండడంతో రాత్రి సమయంలో భక్తులకు సరైన భోజనం లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్నారు. వీరికి రాత్రి వేళల్లో సరైన భోజన సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ యేడాది ఏప్రిల్ నెలలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేసి కల్యాణం అనంతరం టీటీడీ అధికారులతో ఆలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామభక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదాలను పంపిణీ చేయాలని టీటీడీ అధికారులను ఆదేశించారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి మూడు పూటల భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. అందుకు అనుగుణంగా మంగళవారం జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో నిధుల కేటాయింపు కూడా జరిగింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం, అల్పాహారం అందేలా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీటీడీ పాలకవర్గం నిరంతరాయ అన్న ప్రసాద పంపిణీకి నిధులు కేటాయించడంతో రామ భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఒంటిమిట్టలోని అన్న ప్రసాద కేంద్రం

ఎన్నేళ్లో.. ఎదురు చూపులు

- 14 ఏళ్లు అయినా... ఉద్యోగాలు ఇవ్వరా
- అదిగో ఇదిగో అంటూ సాగదీస్తున్న యూసీఐఎల్
- ఆర్డీఓ కార్యాలయంలో ఫైల్ మాయం
- లబోదిబోమంటున్న బాధితులు

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపల్లె వద్దనున్న యూసీఐఎల్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తామని చెప్పి 14 ఏళ్లు అవుతున్న నేటికి అతీగతీ లేదు. యూసీఐఎల్ టెయిలింగ్‌పాండ్ నిర్మాణంలో భూములు కోల్పోయిన మూడు కుటుంబాల వారు ఉద్యోగాల కోసం వేముల తహసీల్దార్ కార్యాలయం, పులివెందుల ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. తాజాగా వీరికి సంబంధించిన ఫైల్ ఆర్డీఓ కార్యాలయంలో మాయం అయ్యిందని బాధితులు వాపోతున్నారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే..

వేముల మండలంలోని ఎమ్.తుమ్మలమలపల్లె వద్ద యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్) ఆదర్యంలో 14ఏళ్ల క్రితం యురేనియం శుద్ధికర్మాగారం ఏర్పాటు చేశారు. కర్మాగారం ఏర్పాటు సమయంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి, ఆ కుటుంబబాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని యూసీఐఎల్ ప్రకటించింది. అలాగే శుద్ధి కార్మగారంలో ముడి యురేనియం శుద్ధి అనంతరం వచ్చే వ్యర్థాలు టెయలింగ్‌పాండ్‌లో నిల్వచేయాల్సి ఉంది. ఇందుకోసం సేకరించిన భూములకు సంబంధించి ఇప్పటికీ కొంతమందికి యూసీఐఎల్ న్యాయం చేయాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేకే కొట్టాలకు సంబంధించిన భాస్కర్, రవిశంకర్, రాజశేఖర్ గుప్త కుటుంబాలకు సంబంధించిన వ్యవసాయ భూములు టెయిలింగ్ పాండ్ నిర్మాణంలో కోల్పోయారు. 884 సర్వే నెంబర్‌లో వీరి ముగ్గురికి సంబంధించిన వ్యవసాయ భూములు యూసీఐఎల్ తీసుకుంది. కానీ ఈ సర్వే నెంబర్‌లో ఉన్న విస్తీర్ణంలో రెండుసెంట్ల భూవిస్తీర్ణం భూరికార్డుల్లో అధికంగా ఉందని.. ఇది సరిచేసుకుంటే ఉద్యోగం కల్పిస్తామని యూసీఐఎల్ అప్పట్లో చెప్పింది. ఈ కారణంతో 14 ఏళ్లుగా మాకు ఉద్యోగాలు కల్పించకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారని ఈ ముగ్గురు బాధితులు వాపోతున్నారు. వందలసార్లు వేముల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆ ఫైల్‌ను ఆర్డీఓ కార్యాలయానికి ఆరు నెలల క్రితం చేర్చామని... అప్పటి నుంచి అనేక మార్లు ఆర్డీఓ కార్యాలయానికి తిరుగుతున్నా అదోగో ఇదిదో అని సాకులు చెప్పడం తప్ప మాకు న్యాయం జరగడం లేదని వారు ఆవేదన చెందారు. గత నెల రోజులుగా ఆర్డీఓ కార్యాలయలో ఈ ఫైల్ కనిపించడం లేదని అధికారులు సెలవిస్తున్నారు. దీంతో భాస్కర్, రవిశంకర్‌లు మా ఫైల్ ఎక్కడకు పోయిందని ప్రతిరోజు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతికి సమాచారం ఇవ్వడంతో అక్కడకు వెళ్లగా... ఆ సమయంలో బాధితులు ఇరువురు వారి ఫైల్ విషయమై ఏఓ రవీంద్రారెడ్డిని ప్రశ్నించా టరు. మా ఫైల్ మీ టేబుల్‌పైనే ఉందని గతంలో ఏఓగా పని చేసిన, ప్రస్తుతం వేముల తహసీల్దార్‌గా ఉన్న రెడ్డిలక్ష్మి చెప్పారన్నారు. ఇందుకు ఏఓ నా టేబుల్‌పైన ఎలాంటి ఫైలు లేదని వారికి తెగేసి చెప్పారు. చివరకు వేముల తహసీల్దార్ రెడ్డిలక్ష్మికి ఫోన్ చేసి ఫైల్ ఎక్కడుందని ప్రశ్నించడంతో మీ టేబుల్‌పైనే ఉందని ఆమె సమాచారం ఇచ్చారు. కానీ ఆ ఫైల్ మాత్రం కనిపించలేదు. ఈ ఫైల్ విషయమై రెండు రోజుల క్రితం ఆర్డీఓ చిన్నయ్యను అడగ్గా.. అందుకు ఆయన ఉందిలే అంటున్నారు తప్ప ఎక్కడున్నది కూడా తెలపడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఈ విషయమై ఆర్డీవోను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఫైల్ నా వద్దనే ఉందని.. ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు.


పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో ఫైల్ కోసం ఏఓను అడుగుతున్న బాధితులు



ఉద్యోగం ఎప్పుడు ఇస్తారో...

మా కుటుంబానికి సంబంధించి 884/పి4 సర్వేనెంబర్‌లో 84సెంట్ల భూమి ఉండేది. ఈ భూమిని టెయిలింగ్ పాండ్ నిర్మాణంలో యూసీఐఎల్ వారు తీసుకున్నారు. మాకు ఉద్యోగం ఇస్తామని చెప్పి 14ఏళ్లుగా తిప్పుకుంటున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయాం. ఎప్పటికి యూసీఐఎల్‌లో ఉద్యోగం ఇస్తారో తెలియడం లేదు.

-రవిశంకర్, కెకె కొట్టాల, వేముల మండలం.



రిటైర్‌మెంట్ స్టేజీలో ఇస్తారా..

యురేనియం ప్రాజెక్టు నిర్మించే సమయంలో టెయిలింగ్ పాం డ్ కోసం 884/పీ3లో మా భూమి యూసీఐఎల్ తీసుకుంది. ఉద్యోగం ఇస్తామని చెప్పి 14 ఏళ్లుగా మమ్మల్ని తిప్పుకుంటు న్నారు. సగం జీవితం అయిపోయింది. రిటైర్‌మెంట్ స్టేజీలో మాకు ఉద్యోగాలు ఇస్తారా....

-భాస్కర్, కెకెకొట్టాల, వేముల మండలం

బాలల పరిరక్షణలో భాగస్వాముల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్ర జ్యోతి): బాలల పరిరక్షణలో సంబంధిత కమిటీ సభ్యుల భాగస్వామ్యం కీలకమని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్లో బాలల పరిరక్షణలో భాగస్వాముల పాత్ర అనే అంశంపై జమ్మలమడుగు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల పరిధి లోని తహశీల్దార్లు, ఎంపీడీవోలు, బాల సంక్షేమ పోలీసు అధికారులు, మండల విద్యాధికారులకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాలల పరిరక్షణలో ప్రతి విభాగం సమన్వయం అవసరమన్నారు. పిల్లలకు సంబంధించిన కేసుల్లో వీరందరి పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాపులో పాల్గొన్న అధికారులకు ఐసీడీఎస్‌పీడి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సమాజ సంక్షేమ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఆ రెండు రైళ్లకు స్టాపింగ్ ఇవ్వండి

- రైల్వే అధికారులకు బీజేపీ నాయకుల వినతి

జమ్మలమడుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రైల్వే స్టేషన్‌లో రైలు తిరుపతి-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17262), గుంటూరు-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు (17261) నిలపాలని బీజేపీ నాయకులు రైల్వే అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం రైల్వేస్టేషన్ వద్దకు వచ్చిన గుంతకల్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ మనోజ్, సీనియర్ డివిజన్ ఆపరేటింగ్ మేనేజర్ శ్రావణ్‌కుమార్‌లకు జమ్మలమడుగుకు చెందిన బీజేపీ నాయకులు సిలివేరి వెంకటేశ్వర్లు, గండికోట చారిటబుల్ ట్రస్టు నేత వై.చంద్రశేఖర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు.


రైల్వే అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఈ సందర్భంగా రైల్వే అధికారులతో వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం తిరుపతి గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు జమ్మలమడుగులో నిలిపేవారని.. దీంతో విద్యార్థులకు, ఉద్యోగులకు, దాల్మియా ఫ్యాక్టరీ కార్మికులకు, గండికోటకు వచ్చే పర్యాటకులకు ఎంతో సౌకర్యంగా ఉండేదన్నారు. 2025 జూలై 7 నుంచి జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో ఆ రైళ్లు నిలుపుదల ఆపేశారన్నారు. దీంతో ప్రయాణికులు విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులు ఊసువాండ్ల పాములేటి, రమణారావు, రంగనాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ సీసీఐ డ్రాయింగ్ పోటీకి చీఫ్ జడ్జిగా గంపమల్లయ్య ఎంపిక

కడప ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హ్యూమానిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ విశాఖపట్టణం గీతం యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్ సీసీఐ డ్రాయింగ్ పోటీలో, జాతీయస్థాయి ప్రతిభావంతుడు, పలు అవార్డులు అందుకున్న బీరీ గంపమల్లయ్య చీఫ్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈయన కడప నగరం హైద రాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఆర్ట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది సీనియర్ కళాకారులు ఉన్న కూడా ఈ అవకాశాన్ని తనకు ఇవ్వడం పట్ల ఎంతో కృతజ్ఞతగా భావిస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు ఎంఈఓలకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్

కడప ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీ బదిలీల మాన్యువల్ కౌన్సెలింగ్‌లో ప్రిఫరెన్షియల్ కేటగిరీలో బదిలీల చట్టం 2025 ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై కడప ఎంఈవో గంగిరెడ్డి, ప్రొద్దుటూరు ఎంఈఓ సావిత్రమ్మలకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఇచ్చినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు షంషుద్దీన్ తెలిపారు. పది రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రిఫరెన్షియల్ క్యాటగిరీలో కేటాయించాల్సిన స్థానాల కంటే అధికంగా కేటాయించారని... దీంతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టంగా పోయారని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకోవడం జరిగిందని స్పష్టం చేశారు. అలాగే విధుల పట్ల అలసత్వంగా వ్యవహరించినందుకు ఎస్‌జీటీ ఎంపీ శివారెడ్డికి కూడా ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ జారీ చేశామన్నారు. ఈయన కూడా పది రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు.

భార్యను చంపిన భర్త అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న సీఐ శివశంకర్

చాపాడు, జూలై 22 (ఆంధ్ర జ్యోతి): మండంలోని చియ్యపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల గోపాల్ తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని హత్య చేశాడు. మంగళవారం అతన్ని అరెస్టు చేసి మైదుకూరు కోర్టులో హాజరుపరిచినట్లు రూరల్ సీఐ శివశంకర్ పేర్కొన్నారు. చాపాడు పోలీసు స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ గురువారం రాత్రి నల్లబోతుల గోపాల్ తన భార్య సుజాతను టవల్‌తో గొంతు నులిమి చంపాడు. ఈమేరకు అతనిపై కేసు నమోదు చేసి.. ప్రొద్దుటూరు-మైదుకూరు జాతీయ రహదారి పక్కన చియ్యపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఉండగా అరెస్టు చేశామని తెలిపారు.

బాలిక హత్య కేసులో పదేళ్లు జైలుశిక్ష

కడప క్రైం/రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) మూడేళ్ల బాలికను హత్యచేసిన కేసులో పదేళ్ల జైలు శిక్షను విధిస్తూ మంగళవారం నాల్గవ అదనపు జిల్లా కోర్టు తీర్పును వెలువరించింది. చిన్నచౌకు పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు పట్టణం బుధవారపేటకు చెందిన కత్తెర విశ్వనాథం (35) తన భార్యతో కలిసి కడప నగరానికి కూలి పనులకు వచ్చి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఒక అద్దె ఇంట్లో నివశించేవాడు. దూరపు చుట్టమైన సుజాత తన కుమార్తె మూడేళ్ల శ్రీలతను విశ్వనాథం ఇంట్లో వదిలి కూలి పనులకు వెళ్లింది. దీంతో చిన్నారి తనకు నిద్రాభంగం కలగజేసిందని 2017 ఫిబ్రవరి 1న విక్షణా రహితంగా కొట్టి చంపాడు. ఈ మేరకు చిన్న చౌకు పోలీసులు ఐపీసీ సెక్షన్ 304 కింద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. మంగళవారం జరిగిన తుది తీర్పులో అతన్ని దోషిగా నిర్ధారించి 10 సంవత్సరాలు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.1000లు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



కడప క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫారం వద్ద మంగళవారం ఓ వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తికి 60 సంవత్సరాల వయసు ఉంటుంది. ఇతను సహజ మరణం చెందినట్లు తెలిపారు. మృతుడి ఛాతి మధ్యలో మానిపోయిన తెల్లటి గాయం మచ్చ ఉందని.. ఇతర వివరాలకు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి రహదారిలోని గోటూరు సమీపంలో కపిల్ చిట్‌ఫండ్స్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... కుమారునిపల్లెకు చెందిన నందకిశోర్ సొంత పనిపై ద్విచక్రవాహనంలో కడపకు వెళుతుండగా.. కడప నుంచి కమలాపురం వైపు బైకులో వస్తున్న బత్తల బాబు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు మట్కా బీటర్లు అరెస్టు

కడప క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కపల్లె సర్కిల్ సమీపంలో ఇద్దరు మట్కా బీటర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాల మేరకు... మంగళవారం మట్కా ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ అమర్‌నాథరెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేసి కటారు శ్రీనివాసులు, ఆంజనేయ ప్రసాద్‌రెడ్డిలను అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి రూ.4200 నగదు, మొబైల్ ఫోను, మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో 8 మంది అదుపులో...

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని ఇనగలూరు గ్రామానికి చెందిన సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలపై హత్యాయత్నానికి పాల్పడిన బాబురెడ్డి మరో 11మందిపై కేసు నమోదైంది. ఈ కేసులో బాబురెడ్డితో పాటు మరో 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న అనంతరం పోలీసులు కోర్టుకు హాజరు పరిచే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

దువ్వూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాలికపట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఏకోపల్లె గ్రామానికి చెందిన చెంచయ్యగారి ప్రసాద్ అనే వ్యక్తి కొంత కాలంగా ఓ బాలికను లైంగికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెళ్లి చేసుకోకుండా మోసం చేసిన వ్యక్తిపై...

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థం చేసుకొని పెళ్లికి నిరాకరిస్తున్న యువకుడిపై పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ఛీటింగ్‌కేసు నమోదైంది. తాడిపత్రికి చెందిన జయచంద్ర ఇటీవల పులివెందుల మండలంలో ఓ యువతితో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. జయచంద్ర చెన్నైలో సాఫ్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఎంగేజ్‌మెంట్ అయిన తర్వాత పెళ్లికి నిరాకరిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు.

పశుపోషణతో సుస్థిర ఆదాయం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పశుపోషణ ద్వారా రైతులు సుస్థిర ఆదాయం సాదించవచ్చని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జేవీ రమణ తెలిపారు. మంగళవారం శ్రీవెంకటేశ్వర పశువైద్యశాలలో హైదరాబాదుకు చెందిన ఐసీఏఆర్ అనుబంధ సంస్థ ఎన్‌ఏఆర్‌ఎం సహకారంతో సుస్థిర గ్రామీణ జీవనోపాధిలో పాడిపరిశ్రమ ఆవశ్యకత అనే అంశంపై అయిదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషణ ద్వారా రైతులు, యువత ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ వెంకటేశ్వరరావు సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ పశుపెంపకం, దేశవాలీ ఆవుల ప్రాముఖ్యత, జీవ ఎరువులు, రసాయనాలు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి మాట్లాడుతూ పశువులు, పశువుల ఉత్పత్తి ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని సూచించారు. ఎన్‌ఏఆర్‌ఎం శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ, పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ గీతాప్రియ, యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ కన్వీనర్ డాక్టర్ మాలకొండయ్య, పశువైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో విజయవాడ, అనంతపురం, కదిరి, బద్వేలు, మైలవరం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన 45 మంది యువ రైతులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ రమణ

హత్యాయత్నం కేసులో ఆరుగురు అరెస్టు

కడపక్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం గంజికుంట కాలనీలో గత నెల 25న గొంతుముక్కల వెంకటసుబ్బయ్యపై కత్తితో దాడి చేసిన కేసుకు సంబంధించి ఆరుగురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. కడప చిన్న చౌకు పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను వెల్లడించారు. కడప మాసా పేటకు చెందిన తాటిగిరి అనూష, పాలెం సుబ్బరా యుడు అలియాస్ సుబ్బన్న, సీకేదిన్నె మండలం నరసరా మయ్యగారిప ల్లెకు చెందిన సోమ ప్రశాంత్, సుగమాల నవీన్ అలియాస్ శిగనమాల నవీన్, సిబ్యాల సుబ్బరాయుడు, మాసా పేటకు చెందిన తాటిగిరి నిర్మలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కత్తి, బైకు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో మహిళ...

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో కరుణ కుమారి అనే మహిళను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ చాంద్ బాష తెలిపారు. పట్టణంలోని గుంతబజార్‌లో నివాసం ఉంటు న్న ఒంటరి మహిళ అయిన హసీనా జూలై 1వ తేదీ హత్యకు గురయ్యారు. ఈ కేసులో నిందితురాలుగా ఉన్న కరుణకుమారి అనే మహిళను సోమవారం అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు.

1229 మంది నిరుపేద పిల్లల గుర్తింపు

- అందరికీ ఆధార్ రిజిస్ట్రేషన్ : జడ్జి

కడప రూరల్, జూలై 22: నిరుపేద పిల్లల ఆధార్ కోసం సర్వే నిర్వహించి 1229 మందిని గుర్తించామని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో నిరుపేద పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సాతి కమిటీ మెంబర్స్‌తో జిల్లా వ్యాప్తంగా నిరుపేద పిల్లల ఆధార్‌కోసం సర్వే నిర్వహించి ఆధార్ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతోందని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి తగు చూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీ నాయుడు, రాయచోటి రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ప్యానల్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు

26న బండలాగుడు పోటీలు

సీకేదిన్నె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26 శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా అప్పరాజుపల్లె అభయహస్త ఆంజనేయస్వామి దేవాలయం వద్ద కేటగిరి ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.40,116, రెండో బహుమతి రూ.30,116, మూడో బహుమతి రూ.20,116, నాలుగో బహుమతి రూ.15,116, ఐదో బహుమతి రూ.10,116, 6వ బహుమతి రూ.6,116, 7వ బహుమతి రూ.5,116 అందించనున్నట్లు తెలిపారు. ఎద్దుల యజమానులు శనివారం ఉదయం 11 గంటలలోపు పేర్లు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి మృతి


రాహుల్‌రామిరెడ్డి (ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి-జూబ్లీనగర్ గ్రామాల మధ్య రోడ్డుపై కారు అదుపుప్పి బోల్తాపడిన ఘటనలో కడపకు చెందిన వైద్య విద్యార్థి ఏటూరి రాహుల్ రామిరెడ్డి (24) దుర్మరణం చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురు వైద్యవిద్యార్థులకు గాయాలయ్యాయి. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.... కడపకు చెందిన ఏటూరి రాహుల్‌రామిరెడ్డి, గుంటూరులోని శ్యామలనగర్‌కు చెందిన మోపిదేవి జయంత్, కర్ణాటకలోని రాయ్‌చూర్ జిల్లా చిందంటౌన్‌కు చెందిన కడియ వినయ్ చౌదరి, హైదరాబాద్ ఎల్‌బీనగర్‌కు చెందిన ఎం.పృథ్వీరాజ్, సిద్దిపేటలోని మోయిన్‌పురాకు చెందిన బి.పృథ్వీరాజ్ కరీంనగర్‌లోని ప్రతిమ వైద్య కళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కళాశాలకు చెందిన హాస్టల్‌లోనే ఉంటున్నారు. సోమవారం సెలవు కావడంతో ఐదుగురు కరీంనగర్‌లోని బొమ్మకల్ శివారులో ఉన్న చల్మెడ వైద్య కళాశాలలో స్నేహితులను కలిసేందుకు ఉదయం 10 గంటలకు కారులో వెళ్లారు. తిరిగి అదేకారులో రాత్రి 1:30 గంటలకు ప్రతిమ కళాశాలలోని హాస్టల్‌కు బయ ల్దేరారు. జూబ్లీనగర్ ఎల్లమ్మ దేవాలయం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొని బోల్తాపడింది. దీంతో కారులో వెనకవైపున కూర్చు న్న రాహుల్ రామిరెడ్డి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న జయంత్‌తో పాటు మిగతావారికి స్వల్పగాయాల య్యాయి. గాయపడ్డ వారు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. రాహుల్‌రామిరెడ్డి సోదరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వెనుకంజలో చిత్తూరు, కడప జట్లు

కడప స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ పోటీలలో భాగంగా వివిధ జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లలో మంగళవారం చిత్తూరు, కడప జట్లు వెనుకంజలో సాగుతున్నాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 66.3 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో చిత్తూరు బౌలర్ రాకేష్‌సాయి 6 వికెట్లు పడగొట్టారు. అనంతరం చిత్తూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. ఇందులో ఎంఎస్ అక్తర్ 47 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో చిత్తూరు జట్టు మరో 146 పరుగుల వెనుకబడి వుంది.

కేవోఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు- కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు 69.2 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో కడప బౌలర్ గైబు 6 వికెట్లు సాధించడం విశేషం. అనంతరం కడప జట్టు రెండో ఇన్నింగ్స్‌లో రెండవరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 95 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది. ఇందులో జయప్రణవశాస్త్రి 13 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. మరో 59 పరుగుల వెనుకంజలో కడప జట్టు ఎదురీదుతోంది.

'గాలేరు - నగరి ప్రాజెక్టును గాలికొదిలేశారు'

చిట్వేలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : తక్కువ బడ్జెట్ కేటాయించి గాలేరు - నగరి ప్రాజెక్టును గాలికొదిలేశారని రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన చిట్వేలిలో విలేకరులతో మాట్లాడుతూ గాలేరు - నగరి ప్రాజెక్టు రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు తాగు, సాగునీరు, భూగర్భజలాలకు జీవనాధారం అన్నారు. అలాంటి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.2438.9 కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు.

కేరళ మాజీ సీఎంకు నివాళి

రైల్వేకోడూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి: కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కు రైల్వేకోడూరు సీఐటీయూ కార్యకర్తలు, నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అచ్యుతానందన్ ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు.

రాజంపేటలో...

కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతిపట్ల రాజంపేటలో సీఐటీయూ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అచ్యుతానందన్ పేదల పెన్నిధిగా గుర్తింపు పొందిన మహానేత అని కొనియాడారు. సీఐటీయూ నాయకులు రవికుమార్, రమణ, బాలయ్య, ప్రసాద్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న డాక్టర్ ప్రకాష్

సిద్దవటం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయండి - ప్రాణాలను కాపాడండి అని సిద్దవటం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ తెలిపారు. మంగళవారం సిద్దవటం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో వలంటరీ రక్తనిధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో త్వరలో ఆపరేషన్ థియేటర్ ప్రారంభం కానుందన్నారు. ఆపరేషన్ చేయించుకునేవారికి రక్తం అవసరమని, అందుకోసం బ్లడ్ డొనేషన్ చేసి కడప రిమ్స్‌కు అందజేస్తున్నామన్నారు.

మంచిపేరు తెచ్చుకోవాలి

పుల్లంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఏఎన్ఎంలు బాధ్యతతో పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలని డాక్టర్ సానె శేఖర్, మనోజ్ చంద్ర, శ్రీనిజ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బదిలీ అయిన ఏఎన్ఎంలను డాక్టర్స్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎక్కడ పనిచేసినా విధుల్లో మంచి పేరు తెచ్చుకోవాలని ఏఎన్ఎంలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖలో పరిశోధనలే కీలకం

సంబేపల్లె, జూలై 22(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో పరిశోధనలే కీలకమని డైట్ సీనియర్ అధ్యాపకుడు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. పరిశోధన, వినూత్న పద్ధతులపై పాఠశాల విద్యాశాఖ రెండు రోజులు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల వైపు అడుగులేసేలా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. నాణ్యమైన విద్య కోసం సమగ్ర శిక్ష కింద అనేక కార్యక్రమాలు పాఠశాల్లో అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సురేష్‌బాబు, విశ్వనాథప్ప, భరత్‌కుమార్, కన్నన్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఓబులవారిపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ముక్కవారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో మంగంపేట గ్రామం పరిధిలోని నీటికుంటలో గంబూషియా చేప పిల్లలను వదిలారు. అలాగే ప్రస్తుత వర్షాకాలం కాబట్టి అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ఇలా..రాకపోకలు ఎలా..?



నేకనాపురంలో కుంటను తలపిస్తున్న రోడ్డు

సిద్దవటం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలంలోని నేకనాపురం గ్రామంలో ఆర్‌అండ్‌బి రోడ్డు వర్షాలకు చినుకు పడితే రొచ్చు రొచ్చుగా మారింది.మరికొంత భాగం కుంటను తలపిస్తోంది. రహదారి గుంతలమయం కావడంతో విద్యార్థులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రహదారి జలమయమైంది. గత వైసీపీ పాలనలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాలకులు దెబ్బతిన్న రహదారి పనులు చేపడతామని హామీ ఇచ్చినా అమలు కాలేదు. ఈ రహదారి నుంచి ఒంటిమిట్ట, సిద్దవటం, మాధవరం, నందలూరు తదితర గ్రామాలకు వాహనాలు వెళుతూ ఉంటాయని, దెబ్బతిన్న రహదారి పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అయినా చొరవ తీసుకుని రహదారి పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దెబ్బతిన్న రహదారిపై ఆర్‌అండ్‌బి ఏఈ రామాంజనేయులును వివరణ కోరగా జూలై 15న ఉన్నతాధికారులకు నేకనాపురం, వెలుగుపల్లె, కమ్మపాలెం గ్రామాల్లో ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్డు కల్వర్టు పనులు చేపట్టేందుకు నాలుగు కోట్ల రూపాయలు వ్యయంతో అంచనా వేసి అధికారులకు నివేదిక పంపించామని అనుమతులు రాగానే పనులు మొదలు పెడతామని ఏఈ తెలిపారు.

కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలి



జగనన్న ప్రభుత్వంలో వైసీపీ నేతలు ప్రజలకు ఉత్తిత్తి హామీలు ఇచ్చి మోసం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్డు మరమ్మతులపై దృష్టిపెట్టాలి. - గంగారెడ్డి, నేకనాపురం

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం చేశారు



గత వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధి దృష్టి పెట్టక ఈ దుస్థితి ఏర్పడింది. గ్రామంలో ఈ రహదారి నుంచి ఒంటిమిట్ట కోదండరాముని దేవాలయానికి దూర ప్రాంతాల వాహనదారులు వెళుతుంటారు. వెంటనే ఈ రహదారి పనులు చేపట్టాలి. - ఉమ్మడి గంగిరెడ్డి

శివాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్ పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, జనసైనికులు

చిట్వేలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, జనసైనికులతో కలిసి చిట్వేలి శివాలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నటించిన హరహర వీరమల్లు బుధవారం విడుదల కానున్న సందర్భంగా ఆ సినిమా విజయఢంకా మోగించాలని వారు పూజలు చేశారు. శివాలయం కమిటీ సభ్యు లు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ నటించిన సినిమా ప్రజల ఆదరాభిమానాలు పొంది ఆయన కీర్తి ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాదాసు నరసింహ, కోనిశెట్టి సుబ్బరాయుడు, కంచర్ల సుధీర్‌రెడ్డి, మన్మధ, పగడాల శివ, రాజా, రియాజ్, పెంచలయ్య, పవన్‌రాజు, తేజ, అవినాష్, సాయి, చక్రి, రమేష్, సతీష్, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న తరహా నీటి వనరుల గణన పక్కాగా చేపట్టాలి

సంబేపల్లె, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా 2023-24 ప్రాతిపదికగా 7వ చిన్న తరహా నీటి వనరుల గణన పక్కాగా చేపట్టాలని తహసీల్దారు సుబ్రహ్మణ్యం రెడ్డి తెలియజేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన సహాయ గణాంక అధికారి షేక్ హుస్సేన్ సాహెబ్‌తో కలిసి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2023-24 ప్రాతిపదికగా భూగర్భ జలనీటి వనరులు, బోర్లు, బావుల గణన చేపట్టాలన్నారు. ఉపరితల నీటి వనరులు, చెరువులు, కుంటలు, చెక్ డ్యాములు, పార్కులేషన్ ట్యాంకులు, ఫారం పాండులు గణన చేపట్టాలన్నారు. భూగర్భ జలం పెంచేందుకు ఉపయోగించవలసని వనరులపైన గణన చేపట్టి ఏ వనరుల కింద 2023-24లో ఎన్ని ఎకరాలు సాగు చేయడానికి వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు చేసిన ఖర్చులు, వాటి రిపేర్లకు అయిన ఖర్చులను మొబైల్ యాప్ ద్వారా వీఆర్వోలు, సర్వే నెంబర్ల ఆధారంగా ఏ ఒక్క వనరును వదలకుండా జియో ట్యాగింగ్ చేసి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ప్రతి ఒక్కరు తప్పకుండా చిన్న తరహా నీటి వనరుల గణన చేపట్టాలని తెలియజేశారు. యాప్ వినియోగించే విధానంపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.

అంగన్వాడీలు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సుగుణమ్మ

సుండుపల్లి, జూలై22(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించి సమయ పాలన పాటించాలని ఎసీడీపీవో సుగుణమ్మ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామపంచాయతీల అంగన్వాడీలకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. హాజరును బట్టి విద్యార్థుల నమోదు చేయాలన్నారు. ఈకేవైసీ తప్పని సరిగా చేయాలన్నారు. మెనూ ప్రకారం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివారెడ్డి

రామాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి రామాపురం మండలం టోల్‌గేట్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివారెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శివారెడ్డి బంధువుల వివరాల మేరకు.. రామాపురం మండలం హసనాపురం పంచాయతీ ఊటుకూరు వాండ్లపల్లె చెందిన శివారెడ్డి తన పంట పొలాలకు ఎడ్లబండిపై వెళు తుండగా టోల్ గేట్ సమీపంలో కడప నుంచి రాయచోటి వైపు వెళుతున్న స్కూటర్ ఢీకొంది. దీంతో శివారెడ్డి రోడ్డుపై పడ్డాడు. తీవ్రంగా గాయాలైన శివారెడ్డిని తిరుపతి రుయాకు తరలించారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ పూజ



ఉత్సవరుల ముందు గోరింటాకు పెట్టుకుంటున్న భక్తులు

పెనగలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎగువ నారాయణనెల్లూరులో గల పురాతన శివాలయంలో సోమవారం రాత్రి శివపార్వతులకు భక్తులు మంగళ గౌరీపూజ నిర్వహించారు. సమరత సేవా ఫౌండేసన్ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళా భక్తులతో పాటు చిన్నారులు సైతం ఈ పూజలో పాల్గొని ఆషాడ మాసం గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజంపేట డివిజన్ ధర్మ ప్రచారకులు సూర్యనారాయణ, నెల్లూరు గ్రామ పెద్దలు, భజన బృందం పాల్గొన్నారు.

తాగునీరు పరిశుభ్రంగా ఉండాలి : ఎంపీడీవో

పుల్లంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పాఠశాలల్లో మినరల్ వాటర్‌ప్లాంట్ ద్వారా పరిశుద్ధమైన తాగునీరు అందించాలని ఎంపీడీవో శిరీషా ఆదేశించారు. మంగళవారం ఆమె స్థానిక ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాగునీరు అందించే మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణ మెరుగుపరుచుకోవాలన్నారు. విద్యార్థులకు తాగునీరు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. అలాగే వంటశాల పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. ఈ సమస్యలు పునరావృతం కాకుండా సరి చేసుకోవాలని ప్రిన్సిపాల్ లీలాశ్రీహరిని ఆదేశించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామి ఆలయంలో అన్నదానం



వెంకయ్యస్వామి భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకయ్య స్వామి ఆలయంలో మంగళవారం భక్తులకు కాపు నాయకులు, బోళా శంకర్ సేవా సమితి అధ్యక్షుడు మందల నాగేంద్ర తన తండ్రి వర్ధంతి సందర్భంగా వెంకయ్యస్వామి భక్తులకు అన్నదానం చేశారు. ఆలయంలో మొదట ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్

సుండుపల్లి;జూలై 22(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం అని మండల ప్రత్యేకాధికారి సురేష్ కూమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీలో పి4 కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పేదలను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గుర్తించినవారిని దత్తత తీసుకునేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులను, ఆధికారులతో పాటు ప్రైవేటు వ్యక్తులను ప్రోత్సాహిస్తున్నట్లు పేర్కొన్నారు. దత్తత కుటుంబాలకు ఆర్థిక అభివృద్ధి, మెరుగైన ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం ఇతర అవకాశాలు కల్పించేలా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మహబూబ్ చాంద్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు భగవాన్ సహాయ రెడ్డి, యూనియన్ బాషా, పంచాయతీ కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశాం

● కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి



అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్బరామయ్యను పరామర్శించిన ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఇంకా రూ.20 కోట్ల నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. కోడూరు పట్టణంలో రూ.13 కోట్లతో అతిత్వరలో భూగర్భ డ్రైనేజ్ పనులు ప్రారంభిస్తామన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీనగర్ వీధిలో సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఏడాదిగా చేసిన సంక్షేమ పథకాలను వివరించామని తెలిపారు. పట్టణంలోని ప్రధాన సమస్యలను తెలుసుకున్నామన్నారు. ప్రజలకు ఏలోటు రాకుండా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిత్యం ప్రజా సంక్షేమం కోసమే తపన పడుతున్నారన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.6 లక్షల చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. కోడూరు టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు పఠాన్ మౌలా, వార్డు సభ్యులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, పోకల మణి, తల్లెం వెంకటరమణారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, గడికోట సుబ్బరాయుడు, తిరుపతి శేఖర్, సిద్ధేశ్వర, మైనారిటీ నాయకురాళ్లు మెహతాజ్ బేగం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీమా పథకాలను వినియోగించుకోండి

● యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్

రాజంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న బీమా పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని రాజంపేట ఆర్ఎస్ రోడ్డు పరిధిలోని కూచివారిపల్లె యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ శ్రీధర్ పేర్కొన్నారు. రాజంపేట పట్టణం బలిజపల్లె ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడూత భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో ప్రతి గ్రామస్థాయి జన సంరక్షణ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ కార్యక్రమాన్ని తమ యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి సెప్టెంబరు 30 తేదీ వరకు మూడు నెలల పాటు నిర్వహిస్తామన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి, బీమా యోజన కింద కేవలం రూ.436తో రూ.2 లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. 18-50 సంవత్సరాలు వయస్సున్న వారు ఇందుకు అర్హులన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద 18-70 సంవత్సరాల లోపు ఉన్నవారు ఏడాదికి కేవలం రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తుందన్నారు. అటల్ పెన్షన్ యోజన పథకం కింద 18-40 సంవత్సరాల లోపు వారు వయస్సును బట్టి ప్రీమియం ప్రతినెలా చెల్లిస్తే 60 సంవత్సరాల తర్వాత వారు చెల్లించిన సొమ్మును బట్టి నెలకు వెయ్యి నుంచి ఐదు వేల రూపాయల వరకు లభిస్తుందన్నారు. కావున ఖాతాదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంతో మంచి దిగుబడి



యూరియా వినియోగంపై రైతులకు తెలియజేస్తున్న అధికారులు

సంబేపల్లె, జూలై 22(ఆంధ్ర జ్యోతి): రైతులు వేరుశనగ సాగులో చివరి దుక్కిలో జీవన ఎరువులు ట్రైకోడెర్మావిరిడి, అజక్టోబ్యాక్టీరియా, పాస్ఫో బ్యాక్టీరియా వంటి జీవన ఎరువులు వాడకంతో పంటల ఆరోగ్యం పెరిగి మంచి దిగుబడి సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ సంచాలకులు కె.నిరంజన్ రెడ్డి తెలిపారు. మంగళవారం రౌతుగుంట గ్రామం కొండకిందపల్లెలో వేరుశనగ పంటను ఐఎఫ్ఎఫ్‌సీడీ నారో యూరియా జేడీఏ శివనారాయణతో కలిసి పరిశీలించారు. ఒక ఎకరాలో 500 మిల్లీల నానో యూరియా పిచికారీ చేసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కిశోర్ నాయక్‌తో కలిసి గుట్టపల్లె, ఎస్.సోమవారం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలను, సలహాలను ఇచ్చారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు పంటలను సాగు చేసుకుని పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. వ్యవ సాయ విస్తరణాధికారి రెడ్డి వెంకటరమణ, వీఏఏలు రేణుక, సందీప్ కుమార్ రెడ్డి, అంకిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'అట్టడుగు వర్గాలను అభివృద్ధి చేయడమే సీఎం లక్ష్యం'



మాట్లాడుతున్న లీగల్‌సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

రాజంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అట్టడుగు వర్గాల ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి లక్ష్యమని లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం రైల్వేస్టేషన్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్, సచివాలయంలో జరిగిన పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టిసిపేషన్(పి-4) సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కరువు పీడిత బడుగు బలహీనవర్గాలకు ముఖ్యంగా దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చేయడమే సీఎం లక్ష్యమన్నారు. మున్సిపల్ కమిషన్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాజంపేట అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. టీడీపీ నేత నాగేశ్వర్‌నాయుడు, కౌన్సిలర్ మౌనిక మట్లాడుతూ వార్డు పరిధిలోని ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

వృద్ధులు, వికలాంగులకు 100 శాతం రేషన్ పంపిణీ జరగాలి



మాట్లాడుతున్న తహసీల్దారు అమరేశ్వరి

పెనగలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులకు వంద శాతం రేషన్ పంపిణీ జరగాలని తహసీల్దారు అమరేశ్వరి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవి డీలర్లకు సూచించారు. మంగళవారం మండలంలోని రేషన్ షాపు డీలర్లతో తహసీల్దారు, డీటీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 65 ఏళ్లపైబడిన వృద్ధులు, వికలాంగులు 1200 మంది ఉన్నారని, ప్రతినెలా వారికి ముందుగా రేషన్ అందజేయాలన్నారు. అలాగే ఈకేవైసీ పెండింగ్ ఉన్న లబ్ధిదారుల చేత త్వరగా పూర్తి చేయించి నివేదికను అందజేయాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం



అన్నం పొట్లాలు అందజేస్తున్న మోహన్ తదితరులు

రైల్వేకోడూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): అన్నదానం పుణ్యకార్యమని దుర్గం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, జనసేన నాయకుడు దుర్గం మోహన్ అన్నారు. మంగళవారం తిరుపతి రుయా ఆస్పత్రిలో రోగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులలో నిరుపేదలు చికిత్సల కోసం వస్తుంటారని, వారికి అన్నదానం చేయాలని చాలా రోజుల నుంచి ప్రయత్నించానన్నారు. రుయా ఆస్పత్రి చైర్మన్ బండ్ల లక్ష్మీపతి సహకారంతో రోగులకు అన్నదానం చేశామన్నారు. జనసేన పార్టీ నాయకులు ముద్దపోలు సభాపతి, వరికూటి నాగరాజు, మర్రిరెడ్డి ప్రసాద్, దాసరి వీరేంద్ర, మాదాసు శివ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై
సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఓబులవారిపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం, ఏపీడీ ప్రతాప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించినట్లు ఎంపీడీవో మల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై జరిగిన అవకతవకల్లో రూ.1,95,694 టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేశామ న్నారు. కొలతల్లో జరిగిన తప్పులకు జరిమానాగా రూ.97,367 విధించినట్లు తెలిపారు. రూ.13.42 లక్షల పనులపైన సామాజిక తనిఖీ, ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ధనుంజయ్, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

● జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్



మోడల్ స్కూల్‌లో వంటగదిని తనిఖీ చేస్తున్న జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్

కురబలకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్ పేర్కొన్నారు. మంగళవారం ముదివేడు సమీపంలోని మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అనంతరం వంటగదిని పరిశీలించి స్టాకు రిజిష్టర్‌ను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటుగా మంచి ఆహారం అందివ్వడం ఎంతో ముఖ్యమన్నారు. ఒకప్పుడు హాస్టల్స్‌లో కనీస వసతులు లేక ఎంతో ఇబ్బంది పడేవారని, ప్రస్తుతం ప్రభుత్వం అనేక వసతులను కల్పిస్తోందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థి నిర్దిష్ట లక్ష్యంతో ముందుకెళ్లి జీవితాన్ని సవాల్‌గా తీసుకుని మంచి ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్ళి విజయాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధనంజయులు, ఆర్ఐ శేషాద్రిరావు, ఎంఈఓ ద్వారకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఒకరి అరెస్ట్



పోలీసుల అదుపులో సుబ్రహ్మణ్యం

నందలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నందలూరు పీఎస్ క్రైం నంబరు 191/2020 కేసులో ఏ-3 నిందితుడు రాజంపేట మండలం రేణింతల అరుంధతివాడకు చెందిన పాటూరు సుబ్రహ్మణ్యం అలియాష్ మణిని అరెస్ట్ చేసి తిరుపతి ఆర్ఎస్ఎస్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం కేసులో ముద్దాయిగా ఉండి కోర్టు వాయిదాలకు హాజరు కానందున కోర్టు అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇచ్చినందున అతన్ని తాను తమ సిబ్బంది పట్టుకుని తిరుపతి స్పెషల్ ఆర్ఎస్ఎస్ కోర్టులో హాజరుపరచగా సదరు కోర్టువారు రిమాండ్ నిమిత్తం రాజంపేట సబ్‌జైలుకు పంపించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సిద్ధవటం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె గ్రామ సమీపాన రైల్వేటాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి(50) మృతదేహం లభ్యమైంది. మంగళవారం రైల్వేస్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు కడప రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్ సూచన మేరకు పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సుభాన్ మాట్లాడుతూ నాలుగు రోజుల కిందట మృతిచెందినట్లుగా ఉందని, ఇతని ఆచూకీ కోసం విచారిస్తున్నామని తెలిపారు. రైల్లో ప్రయాణించేటప్పుడు ప్రమాదవశాత్తు కిందపడ్డాడా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని అన్నికోణాల్లో విచారిస్తున్నామన్నారు. మృత దేహన్ని కడప రిమ్స్‌కు తరలిస్తున్నామన్నారు.

మదనపల్లె పంచాయతీ కార్యదర్శి బదిలీ

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ కార్యదర్శి ఎ.మాధవిని కర్నూలు జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. భార్యా భర్తల వర్గీకరణ కింద ఆమె చేసుకున్న దరఖాస్తున్న ప్రభుత్వం ఆమోదించి అంతర్ జిల్లా బదిలీకి సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు తగు చర్యలు తీసుకునేందుకు పంచాయతీ రాజ్ కమిషనరును అనుమతిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం ఆదేశాలలు జారీ చేశారు.

ఆడుదాం ఆంధ్ర ఖర్చుల వివరాలు ఇవ్వండి



సబ్‌కలెక్టరేట్‌కు లేఖ అందిస్తున్న విజిలెన్స్ సీఐ శివన్న, డీసీటీఓ

మదనపల్లెటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ఏడాదిన్నర కిందట నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఖర్చులు, వివరాలు ఇవ్వాలని కడప విజిలెన్స్ సీఐ శివన్న సబ్‌కలెక్టరేట్ డీఏఓ నిర్మలదేవిని కోరారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో డీఏఓను కలిసిన సీఐ, విజిలెన్స్ డీసీటీఓ గీతావాణి పలు అంశాలపై చర్చించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ఎంత మంది క్రీడాకారులు పాల్గొన్నారు, ఎక్కడెక్కడ క్రీడలు నిర్వహించారు, ఒక్కో క్రీడాకారుడికి ఎంత ఖర్చు పెట్టారని వివరాలు అడిగారు. వీటిపై త్వరలో వివరాలు పంపానాలని కోరారు.

పీలేరులో భౌబోయ్...

● గుంపులుగా తిరుగుతున్న శునకాలు
● బడి పిల్లల తల్లిదండ్రుల ఆందోళన
● ద్విచక్ర వాహనదారుల్లోనూ భయం.. భయం



పీలేరు-మదనపల్లె మార్గంలో వాహనం వెంటపడుతున్న కుక్కలు

పీలేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో గ్రామసింహాలు యథేచ్ఛగా స్వైరవిహారం చేస్తున్నాయి. పట్టణంలోని ఒక ప్రాంతం అని కాకుండా ఎక్కడ చూసినా గుంపులుగా దర్శనమిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రి వేళల్లో మహిళలు, పిల్లలు బయటకు రావాలంటే భయపడిపోతు న్నారని, వీధిలోకి రావాలంటే శకునం చూసే రోజులు పోయి శునకం చూసే రోజులు వచ్చాయని పలువురు స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వెంటపడుతున్న శునకాలను చూసి ద్విచక్ర వాహనదారులు కూడా భయపడుతున్నారు.

పెరిగిన కుక్కల సంతతి

పీలేరు పట్టణంలో చికెన్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్ల సంఖ్య పెరిగి పుష్కలంగా ఆహారం దొరుకుతుండడంతో వీధి కుక్కల సంతతి ఇటీవల విపరీతంగా పెరిగింది. దాదాపు గొర్రెల మందల్లా అవి పట్టణంలోని అన్ని ప్రధాన రోడ్లలో కనిపిస్తున్నాయి. మనుషులపైకి, వాహనాలపైకి అవి ఎగబడుతున్నాయి. దీంతో పాదచారులు, ఇటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని ఎల్‌బీఎస్ రోడ్డు, ఎస్వీ డీలక్స్ రోడ్డు, బీవీ రెడ్డి కాలనీ, ఆర్టీసీ,



పీలేరులోని ఎస్వీ డీలక్స్ రోడ్డులో కుక్కల గుంపు

పాత బస్టాండులు, నాగిరెడ్డి కాలనీ, ఆర్టీసీ నల్లగుట్ట, చెన్నారెడ్డి కాలనీ, అజంతా టాకీసు మిట్ట, యల్లమంద క్రాస్ ప్రాంతాల్లో కుక్కల విహారం ఎక్కువగా ఉంటోంది. వాటి సంచారం పెరిగిన కొద్దీ అవి మనుషుల మీద చేస్తున్న దాడులు పెరుగుతున్నాయి. తమ ఆసుపత్రికి ప్రతిరోజూ రెండు కుక్క కరిచిన కేసులు వస్తున్నాయని పీలేరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి రాని కేసులు రోజుకు మరో నాలుగు ఉంటాయని పలువురు విశ్రాంత ఉద్యోగులు తెలిపారు.

ఇంటికి తిరిగి వచ్చే వరకు భయమే...

పీలేరు పట్టణం విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందుతుండడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని చాలామంది పిల్లలను పట్టణంలోని పలు పాఠశాలలు, ట్యూషన్ సెంటర్లలో తమ పిల్లల్ని చేరుస్తున్నారు. తరగతులను బట్టి ఆయా విద్యార్థులకు ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల ఉదయం ప్రత్యేక తరగతులు ఉంటుంటాయి. కుక్కల కారణంగా ఆయా సమయాల్లో పిల్లల్ని ఒంటరిగా పంపాలంటే భయంగా ఉంటోందని పలువురు స్థానికులు పేర్కొన్నారు. గతంలో మాదిరి అవి మనుషులు, అదిరింపులకు భయపడడం లేదని, ఎంత అదిరించినా అవి పైపైకి వస్తున్నాయని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

శాశ్వత చర్యలు చేపట్టాలి

గతంలో కుక్కల సంతతిని నియంత్రించడానికి వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించేవారు. అందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఆ పద్ధతికీ మంగళం పాడారు. ప్రస్తుతం పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ కుక్కలను పట్టుకున్నా వాటిని తీసుకెళ్లి భాకరాపేట అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నారు. అటు వైపు తిరుపతి ప్రాంతంలో పట్టిన కుక్కలను సైతం అక్కడే వదిలేస్తున్నారు. దీంతో అవి కొన్ని రోజులు అక్కడ ఉండి మళ్లీ తమ పాత ఊళ్లకు చేరుకుంటున్నాయి. దీంతో వాటి సమస్య తాత్కాలికంగా సమిసిపోయినట్లు కనిపించినా మళ్లీ విజృంభిస్తోంది. వాటి నియంత్రణకు ప్రభుత్వం ఏదైనా శాశ్వత చర్యలు చేపట్టాలని పీలేరు ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే కుక్కలు పట్టుకుంటాం

● లతీఫ్ ఖాన్, పీలేరు పంచాయతీ ఇన్‌చార్జ్ ఈవో

పీలేరులో కుక్కల సమస్య ఎక్కువైనట్లు ఇటీవల మాకు కూడా ఫిర్యాదులు వచ్చాయి. వాటిని బంధించేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకున్న వారు కావాలి. అటువంటి వారి కోసం విచారిస్తున్నాం. త్వరలోనే వారిని పీలేరుకు పిలిపించి పట్టణంలోని కుక్కలను బందిస్తాం.

పుంగనూరు విలీనం వాయిదా ?

● మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల తరువాతే విలీనం ప్రక్రియ

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో పుంగనూరు నియోజకవర్గాన్ని విలీనం చేసే ప్రక్రియ వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వం నేరుగా ప్రకటన చేయకపోయినా మంగళవారం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు ఈ వాదనకు బలం చేకూరుతోంది. రాజంపేట పార్లమెంటు పరిధిలోని పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కాకుండా చిత్తూరు జిల్లా పరిధిలోకి అప్పటి వైసీపీ ప్రభుత్వం చేర్చింది. పార్లమెంటు పరిధిలోని మిగిలిన ఆరు నియోజకవర్గాలతో కలిపి అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాజంపేట పార్లమెంటు పరిధితో అన్నమయ్య జిల్లాను విస్తరించాలనే యోచనతో పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె డివిజన్‌లోకి మారుస్తూ మే 22న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మార్పులపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోగా అన్నమయ్య, చిత్తూరు జిల్లాల కలెక్టర్లకు రాతమూలకంగా పంపుకోవాలని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో సూచించింది. ఈ గడువు జూన్ 30వ తేదీతో ముగిసింది. అయినా ప్రభుత్వం విలీన ప్రక్రియను చేపట్టలేదు.

పుంగనూరు నియోజకవర్గంలోని పులిచెర్ల మండలానికి చెందినవారు మాత్రం ఈ విలీనంతో విభేదించారు. ఆ మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు. కొత్త ప్రతిపాదన ప్రకారం అన్నమయ్య జిల్లాలోనే కాకుండా ఇప్పుడున్న చిత్తూరు జిల్లా నుంచి కూడా పులిచెర్ల మండలాన్ని వేరు చేసి తిరుపతి జిల్లాలో చేర్చాలని అక్కడి నాయకులు పట్టుబట్టారు. ఈ డిమాండుపై తర్జనభర్జనలు పడుతున్న నేపథ్యంలో నోటిఫికేషన్ గడువు ముగిసి నెల రోజులైనా పుంగనూరు నియోజకవర్గంలోని మండలాలను అన్నమయ్యలో విలీనం చేసే ప్రక్రియ కొనసాగలేదు. ప్రభుత్వం ఈ అంశాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు సమాచారం. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల పరిధులకు సంబంధించి సరిహద్దులపై ప్రజల డిమాండ్లను పరిశీలించి తగు సిఫారసులు చేసేందుకు ప్రభుత్వం మంగళవారం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా, డివిజను, మండల కేంద్రాలకు ప్రస్తుతమున్న దూరాభారాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలని, సరిహద్దుల విషయంలో చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక అంశాలను సమీక్షించాలని, వీటన్నిటిలో సమతుల్యత పాటించే విధంగా అధ్యయనం చేసి తగు సూచనలు చేయాలని ప్రభుత్వం ఉపసంఘానికి సూచనలిచ్చింది. ఈ దశలో పుంగనూరు విలీనం అంశం, అందులో పులిచర్ల మండలాన్ని తిరుపతి జిల్లాకు మార్చే అంశాల విషయం మంత్రివర్గ ఉపసంఘం పరిధిలోకి వస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తం అన్ని జిల్లాల్లో వున్న వేర్వేరు డిమాండ్లతో పాటు పుంగనూరు విలీన ప్రక్రియను కూడా ఉపసంఘం పరిశీలనకు పంపి దాని సిఫారసుల ఆధారంగా తదుపరి ప్రక్రియను చేపట్టేందుకు నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే నెల రోజుల క్రితమే నోటిఫికేషన్ ప్రకారం గడువు ముగిసినా విలీన ప్రక్రియ ముందుకు సాగలేదని కూడా అంటున్నారు.

చోరీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఏఎస్పీ

● 9 తులాల బంగారం స్వాధీనం



వివరాలు తెలియజేస్తున్న ఏఎస్పీ మనోజ్‌హెగ్డే

ఓబులవారిపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చోరీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ మనోజ్‌హెగ్డే తెలిపారు. చోరీకి గురైన 9 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు మంగళవారం ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో నిందితులను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏఎస్పీ ఆ వివరాలు వెల్లడించారు. జూలై 14న చిన్నఓరంపాడు పంచాయతీలోని సీవో కమ్మపల్లె దళితవాడలో ఉంటున్న బొమ్ము ఈశ్వరమ్మ పక్కనే ఉన్న కిరాణా కొట్టుకు ఇంటికి తాళం వేయకుండా వెళ్లింది. అంతలోనే ఈశ్వరమ్మ బంధువులు అయిన రమాదేవి, రామసుబ్బమ్మ ఈశ్వరమ్మ ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను దొంగలించారు. సుమారు 9 తులాల నగలను దొంగలించి పక్కనే ఉన్న తమలపాకు తోటలో దాచిపెట్టారు. ఈనేపథ్యంలో 22వ తేదీ రాజంపేటలో అమ్ముకునేందుకు వెళుతుండగా పోలీసులు రెక్కీ నిర్వహించి పట్టుకున్నారు. రెండు బంగారు గాజులు, ఒక చైను, ఒక జత చెంప సరాలు, ఒక గుండ్ల బ్రాస్‌లెట్, ఒక చైను, ఒక ఉంగరం, ఒక జత మాటీలు, ఒక నెక్లీసు ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యుటేషన్ మరో ఏడాది పొడిగింపు

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా లైవ్ స్టాక్ అధికారి డెప్యుటేషన్ గడువును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జిల్లా లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ సంస్థలో ఈవోగా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఎస్.పెంచలరాజు ఐదో సంవత్సరం కూడా గడువు పొడిగించింది. ఈ ఏడాది జూలై 16 నుంచి 2026 జూలై 15వ తేదీ వరకూ ఈ డెప్యుటేషన్ గడువు వర్తిస్తుందని పేర్కొంటూ పశుసంవర్ధక, డైరీ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఈ మేరకు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

హెల్త్ సూపర్‌వైజర్‌పై విచారణ

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వేముల రమేష్‌పై విచారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2022 ఆగస్టు 20వ తేదీన లంచం తీసుకుంటుండగా ఏసీబీకి రమేష్ పట్టుబడ్డాడు. అప్పటి నుంచి ఈ కేసు విచారణకు నోచుకోకుండా మరుగున పడింది. 2024 ఆగస్టు 9న ఆ తరువాత ఈ ఏడాది మే 28 ఏసీబీ డైరెక్టర్ జనరల్ రమేష్ కేసుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి తగు చర్యల కోసం అందజేశారు. దరిమిలా దీనిపై విచారణ జరపాల్సి వున్న కారణంగా ప్రాథమికంగా నిందితుడు రమేష్ నుంచి వివరణ కోరుతూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి 10 రోజుల్లోగా తన వైపు వివరణలు సమర్పించాలని ఆదేశిస్తూ ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల హోస్‌మణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బుద్ధుని కొండలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

● ప్రభుత్వ భూమిగా ప్రకటించిన రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు

మదనపల్లెఅర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిశెట్టిపల్లె గ్రామం సమీపంలోని బుద్ధుని కొండలో మంగళవారం పోలీసులతో కలిసి రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గ్రామ రెవెన్యూ సర్వేనెంబరు 15లో సుమారు 75 ఎకరాల ప్రభుత్వ గయాల భూమి ఉందని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలోకి ఎవ్వరూ ప్రవేశించరాదని, ఎలాంటి కట్టడాలు నిర్మాణాలు చేపట్టరాదని, అతి క్రమించి కట్టడాలు కట్టిన ఎడల చట్టప్రకారం శిక్షార్హులని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బుద్ధుని కొండపై కొద్దిరోజులుగా పోలీసుల పికిటింగ్ ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు కొండపై కూసాలతో ఫిన్సింగ్ వేశారు. కార్యక్రమంలో తాలుకా పోలీసుల తోపాటు వీఆర్వో నారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

ఒంటిమిట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటిమిట్ట, మంటపంపల్లె, కొత్తమాధవరం ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలలను తనిఖీ నిర్వహించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. డొక్కా సీతమ్మమధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వంట ఏజెన్సీ వారు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఒంటిమిట్ట ప్రధానోపాధ్యాయులు రవీంద్రకుమార్, మంటపంపల్లె ప్రధానోపాధ్యాయులు ఐజయ్య, కొత్తమాధవరం ప్రధానోపాధ్యాయులు అంబేద్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో షంషుద్దీన్

రామ భక్తులకు మూడు పూటలా అన్నప్రసాదం

● రూ.4.35 కోట్ల అన్న ప్రసాదానికి మంజూరు ● ఆగస్టు 1 నుంచి అమలు



ఒంటిమిట్ట కోదండరామాలయం

భక్తులకు ఎంతో ఉపయోగం



ఒంటిమిట్ట కోదండరామాలయానికి వచ్చే భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలను పంపిణీ చేయడం ఎంతో ఉపయోగకరం. దూర ప్రాంత భక్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

- మేకపాటి నందకిశోర్‌రెడ్డి, ఒంటిమిట్ట

నిధుల కేటాయింపు సంతోషకరం



రామ భక్తులకు నిరంతరం అన్న ప్రసాదాలను పంపిణీ చేసేందుకు నిధులు కేటాయించడం సంతోషకరం. రాత్రి వేళల్లో భోజనం లభించక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిరంతరాయ అన్న ప్రసాద పంపిణీతో భక్తుల అవస్థలు తీరుతాయి.

- పసుపులేటి సుబ్బరాయుడు, ఒంటిమిట్ట

ఒంటిమిట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరాముని భక్తులకు టీటీడీ తీపి కబురు అందజేసింది. భక్తులకు ఆకలి తీర్చడానికి మూడు పూటలా అన్న ప్రసాదాలను పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం టీటీడీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఒంటిమిట్ట రామ భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలను పంపిణీ చేసేందుకు రూ.4.35 కోట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కేటాయించినట్లు తెలిపారు. దీంతో రామ భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2016లో ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం టీటీడీలో విలీనం చేసింది. ఆలయ అభివృద్ధి కోసం సుమారు వంద కోట్లను టీటీడీ కేటాయించింది. ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు చేస్తుంది. మూడు సంవత్సరాల క్రితం రామ భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేయాలని నిర్ణయించి ప్రతిరోజు మధ్యాహ్నం సమయంలో అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. ప్రతిరోజు సుమారు 500 మంది భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. టీటీడీ వారు కేవలం మధ్యాహ్నం మాత్రమే అన్న ప్రసాదం పంపిణీ చేస్తుండడంతో రాత్రి సమయంలో భక్తులకు సరైన భోజనం లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్నారు. వీరికి రాత్రి వేళల్లో సరైన భోజన సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ యేడాది ఏప్రిల్ నెలలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేసి కల్యాణం అనంతరం టీటీడీ అధికారులతో ఆలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామభక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదాలను పంపిణీ చేయాలని టీటీడీ అధికారులను ఆదేశించారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి మూడు పూటల భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. అందుకు అనుగుణంగా మంగళవారం జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో నిధుల కేటాయింపు కూడా జరిగింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం, అల్పాహారం అందేలా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీటీడీ పాలకవర్గం నిరంతరాయ అన్న ప్రసాద పంపిణీకి నిధులు కేటాయించడంతో రామ భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఒంటిమిట్టలోని అన్న ప్రసాద కేంద్రం

ఎన్నేళ్లీ.. ఎదురు చూపులు

- 14 ఏళ్లు అయినా... ఉద్యోగాలు ఇవ్వరా
- అదిగో ఇదిగో అంటూ సాగదీస్తున్న యూసీఐఎల్
- ఆర్డీఓ కార్యాలయంలో ఫైల్ మాయం
- లబోదిబోమంటున్న బాధితులు

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపల్లె వద్దనున్న యూసీఐఎల్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తామని చెప్పి 14 ఏళ్లు అవుతున్న నేటికి అతీగతీ లేదు. యూసీఐఎల్ టెయిలింగ్‌పాండ్ నిర్మాణంలో భూములు కోల్పోయిన మూడు కుటుంబాల వారు ఉద్యోగాల కోసం వేముల తహసీల్దార్ కార్యాలయం, పులివెందుల ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. తాజాగా వీరికి సంబంధించిన ఫైల్ ఆర్డీఓ కార్యాలయంలో మాయం అయ్యిందని బాధితులు వాపోతున్నారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే..

వేముల మండలంలోని ఎమ్.తుమ్మలమలపల్లె వద్ద యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్) ఆధర్యంలో 14ఏళ్ల క్రితం యురేనియం శుద్ధికర్మాగారం ఏర్పాటు చేశారు. కర్మాగారం ఏర్పాటు సమయంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి, ఆ కుటుంబాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని యూసీఐఎల్ ప్రకటించింది. అలాగే శుద్ధి కార్మగారంలో ముడి యురేనియం శుద్ధి అనంతరం వచ్చే వ్యర్థాలు టెయలింగ్‌పాండ్‌లో నిల్వచేయాల్సి ఉంది. ఇందుకోసం సేకరించిన భూములకు సంబంధించి ఇప్పటికీ కొంతమందికి యూసీఐఎల్ న్యాయం చేయాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేకే కొట్టాలకు సంబంధించిన భాస్కర్, రవిశంకర్, రాజశేఖర్ గుప్త కుటుంబాలకు సంబంధించిన వ్యవసాయ భూములు టెయిలింగ్ పాండ్ నిర్మాణంలో కోల్పోయారు. 884 సర్వే నెంబర్‌లో వీరి ముగ్గురికి సంబంధించిన వ్యవసాయ భూములు యూసీఐఎల్ తీసుకుంది. కానీ ఈ సర్వే నెంబర్‌లో ఉన్న విస్తీర్ణంలో రెండుసెంట్లు భూవిస్తీర్ణం భూరికార్డుల్లో అధికంగా ఉందని.. ఇది సరిచేసుకుంటే ఉద్యోగం కల్పిస్తామని యూసీఐఎల్ అప్పట్లో చెప్పింది. ఈ కారణంతో 14 ఏళ్లుగా మాకు ఉద్యోగాలు కల్పించకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారని ఈ ముగ్గురు బాధితులు వాపోతున్నారు. వందలసార్లు వేముల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆ ఫైల్‌ను ఆర్డీఓ కార్యాలయానికి ఆరు నెలల క్రితం చేర్చామని... అప్పటి నుంచి అనేక మార్లు ఆర్డీఓ కార్యాలయానికి తిరుగుతున్నా అదోగో ఇదిదో అని సాకులు చెప్పడం తప్ప మాకు న్యాయం జరగడం లేదని వారు ఆవేదన చెందారు. గత నెల రోజులుగా ఆర్డీఓ కార్యాలయలో ఈ ఫైల్ కనిపించడం లేదని అధికారులు సెలవిస్తున్నారు. దీంతో భాస్కర్, రవిశంకర్‌లు మా ఫైల్ ఎక్కడకు పోయిందని ప్రతిరోజు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతికి సమాచారం ఇవ్వడంతో అక్కడకు వెళ్లగా... ఆ సమయంలో బాధితులు ఇరువురు వారి ఫైల్ విషయమై ఏఓ రవీంద్రారెడ్డిని ప్రశ్నించా టరు. మా ఫైల్ మీ టేబుల్‌పైనే ఉందని గతంలో ఏఓగా పని చేసిన, ప్రస్తుతం వేముల తహసీల్దార్‌గా ఉన్న రెడ్డిలక్ష్మి చెప్పారన్నారు. ఇందుకు ఏఓ నా టేబుల్‌పైన ఎలాంటి ఫైలు లేదని వారికి తెగేసి చెప్పారు. చివరకు వేముల తహసీల్దార్ రెడ్డిలక్ష్మికి ఫోన్ చేసి ఫైల్ ఎక్కడుందని ప్రశ్నించడంతో మీ టేబుల్‌పైనే ఉందని ఆమె సమాచారం ఇచ్చారు. కానీ ఆ ఫైల్ మాత్రం కనిపించలేదు. ఈ ఫైల్ విషయమై రెండు రోజుల క్రితం ఆర్డీఓ చిన్నయ్యను అడగ్గా.. అందుకు ఆయన ఉందిలే అంటున్నారు తప్ప ఎక్కడున్నది కూడా తెలపడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఈ విషయమై ఆర్డీవోను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఫైల్ నా వద్దనే ఉందని.. ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు.



పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో ఫైల్ కోసం ఏఓను అడుగుతున్న బాధితులు

ఉద్యోగం ఎప్పుడు ఇస్తారో...



మా కుటుంబానికి సంబంధించి 884/పి4 సర్వేనెంబర్‌లో 84సెంట్ల భూమి ఉండేది. ఈ భూమిని టెయిలింగ్ పాండ్ నిర్మాణంలో యూసీఐఎల్ వారు తీసుకున్నారు. మాకు ఉద్యోగం ఇస్తామని చెప్పి 14ఏళ్లుగా తిప్పుకుంటున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయాం. ఎప్పటికి యూసీఐఎల్‌లో ఉద్యోగం ఇస్తారో తెలియడం లేదు.

-రవిశంకర్, కెకె కొట్టాల, వేముల మండలం.

రిటైర్‌మెంట్ స్టేజీలో ఇస్తారా..



యురేనియం ప్రాజెక్టు నిర్మించే సమయంలో టెయిలింగ్ పాం డ్ కోసం 884/పీ3లో మా భూమి యూసీఐఎల్ తీసుకుంది. ఉద్యోగం ఇస్తామని చెప్పి 14 ఏళ్లుగా మమ్మల్ని తిప్పుకుంటు న్నారు. సగం జీవితం అయిపోయింది. రిటైర్‌మెంట్ స్టేజీలో మాకు ఉద్యోగాలు ఇస్తారా....

-భాస్కర్, కెకెకొట్టాల, వేముల మండలం

బాలల పరిరక్షణలో భాగస్వాముల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్ర జ్యోతి): బాలల పరిరక్షణలో సంబంధిత కమిటీ సభ్యుల భాగస్వామ్యం కీలకమని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో బాలల పరిరక్షణలో భాగస్వాముల పాత్ర అనే అంశంపై జమ్మలమడుగు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహశీల్దార్లు, ఎంపీడీవోలు, బాల సంక్షేమ పోలీసు అధికారులు, మండల విద్యాధికారులకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాలల పరిరక్షణలో ప్రతి విభాగం సమన్వయం అవసరమన్నారు. పిల్లలకు సంబంధించిన కేసుల్లో వీరందరి పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాపులో పాల్గొన్న అధికారులకు ఐసీడీఎస్‌పీడి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సమాజ సంక్షేమ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఆ రెండు రైళ్లకు స్టాపింగ్ ఇవ్వండి

- రైల్వే అధికారులకు బీజేపీ నాయకుల వినతి



రైల్వే అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జమ్మలమడుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రైల్వే స్టేషన్‌లో రైలు తిరుపతి-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17262), గుంటూరు-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు (17261) నిలపాలని బీజేపీ నాయకులు రైల్వే అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం రైల్వేస్టేషన్ వద్దకు వచ్చిన గుంతకల్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ మనోజ్, సీనియర్ డివిజన్ ఆపరేటింగ్ మేనేజర్ శ్రావణ్‌కుమార్‌లకు జమ్మలమడుగుకు చెందిన బీజేపీ నాయకులు సిలివేరి వెంకటేశ్వర్లు, గండికోట చారిటబుల్ ట్రస్టు నేత వై.చంద్రశేఖర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రైల్వే అధికారులతో వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం తిరుపతి గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు జమ్మలమడుగులో నిలిపేవారని.. దీంతో విద్యార్థులకు, ఉద్యోగులకు, దాల్మియా ఫ్యాక్టరీ కార్మికులకు, గండికోటకు వచ్చే పర్యాటకులకు ఎంతో సౌకర్యంగా ఉండేదన్నారు. 2025 జూలై 7 నుంచి జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో ఆ రైళ్లు నిలుపుదల ఆపేశారన్నారు. దీంతో ప్రయాణికులు విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులు ఊసువాండ్ల పాములేటి, రమణారావు, రంగనాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎంఈఓలకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్

కడప ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీ బదిలీల మాన్యువల్ కౌన్సెలింగ్‌లో ప్రిఫరెన్షియల్ కేటగిరీలో బదిలీల చట్టం 2025 ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై కడప ఎంఈవో గంగిరెడ్డి, ప్రొద్దుటూరు ఎంఈఓ సావిత్రమ్మలకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఇచ్చినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు షంషుద్దీన్ తెలిపారు. పది రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రిఫరెన్షియల్ క్యాటగిరీలో కేటాయించాల్సిన స్థానాల కంటే అధికంగా కేటాయించారని... దీంతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టంగా పోయారని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకోవడం జరిగిందని స్పష్టం చేశారు. అలాగే విధుల పట్ల అలసత్వంగా వ్యవహరించినందుకు ఎస్‌జీటీ ఎంపీ శివారెడ్డికి కూడా ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ జారీ చేశామన్నారు. ఈయన కూడా పది రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు.

భార్యను చంపిన భర్త అరెస్టు



వివరాలు తెలియజేస్తున్న సీఐ శివశంకర్

చాపాడు, జూలై 22 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చియ్యపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల గోపాల్ తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని హత్య చేశాడు. మంగళవారం అతన్ని అరెస్టు చేసి మైదుకూరు కోర్టులో హాజరుపరిచినట్లు రూరల్ సీఐ శివశంకర్ పేర్కొన్నారు. చాపాడు పోలీసు స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ గురువారం రాత్రి నల్లబోతుల గోపాల్ తన భార్య సుజాతను టవల్‌తో గొంతు నులిమి చంపాడు. ఈమేరకు అతనిపై కేసు నమోదు చేసి.. ప్రొద్దుటూరు-మైదుకూరు జాతీయ రహదారి పక్కన చియ్యపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఉండగా అరెస్టు చేశామని తెలిపారు.

బాలిక హత్య కేసులో పదేళ్లు జైలుశిక్ష

కడప క్రైం/రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) మూడేళ్ల బాలికను హత్యచేసిన కేసులో పదేళ్ల జైలు శిక్షను విధిస్తూ మంగళవారం నాల్గవ అదనపు జిల్లా కోర్టు తీర్పును వెలువరించింది. చిన్నచౌకు పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు పట్టణం బుధవారపేటకు చెందిన కత్తెర విశ్వనాధం (35) తన భార్యతో కలిసి కడప నగరానికి కూలి పనులకు వచ్చి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఒక అద్దె ఇంట్లో నివశించేవాడు. దూరపు చుట్టమైన సుజాత తన కుమార్తె మూడేళ్ల శ్రీలతను విశ్వనాధం ఇంట్లో వదిలి కూలి పనులకు వెళ్లింది. దీంతో చిన్నారి తనకు నిద్రాభంగం కలగజేసిందని 2017 ఫిబ్రవరి 1న విక్షణా రహితంగా కొట్టి చంపాడు. ఈ మేరకు చిన్నచౌకు పోలీసులు ఐపీసీ సెక్షన్ 304 కింద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. మంగళవారం జరిగిన తుది తీర్పులో అతన్ని దోషిగా నిర్ధారించి 10 సంవత్సరాలు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.1000లు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



కడప క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫారం వద్ద మంగళవారం ఓ వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తికి 60 సంవత్సరాల వయసు ఉంటుంది. ఇతను సహజ మరణం చెందినట్లు తెలిపారు. మృతుడి ఛాతి మధ్యలో మానిపోయిన తెల్లటి గాయం మచ్చ ఉందని.. ఇతర వివరాలకు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి రహదారిలోని గోటూరు సమీపంలో కపిల్ చిట్‌ఫండ్స్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... కుమారునిపల్లెకు చెందిన నందకిశోర్ సొంత పనిపై ద్విచక్రవాహనంలో కడపకు వెళుతుండగా.. కడప నుంచి కమలాపురం వైపు బైకులో వస్తున్న బత్తల బాబు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు మట్కా బీటర్లు అరెస్టు

కడప క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కపల్లె సర్కిల్ సమీపంలో ఇద్దరు మట్కా బీటర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాల మేరకు... మంగళవారం మట్కా ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ అమర్‌నాధరెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేసి కటారు శ్రీనివాసులు, ఆంజనేయ ప్రసాద్‌రెడ్డిలను అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి రూ.4200 నగదు, మొబైల్ ఫోను, మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో 8 మంది అదుపులో...

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని ఇనగలూరు గ్రామానికి చెందిన సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలపై హత్యాయత్నానికి పాల్పడిన బాబురెడ్డి మరో 11మందిపై కేసు నమోదైంది. ఈ కేసులో బాబురెడ్డితో పాటు మరో 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న అనంతరం పోలీసులు కోర్టుకు హాజరు పరిచే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

దువ్వూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాలికపట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఏకోపల్లె గ్రామానికి చెందిన చెంచయ్యగారి ప్రసాద్ అనే వ్యక్తి కొంత కాలంగా ఓ బాలికను లైంగికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెళ్లి చేసుకోకుండా మోసం చేసిన వ్యక్తిపై...

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థం చేసుకొని పెళ్లికి నిరాకరిస్తున్న యువకుడిపై పులివెందుల పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. తాడిపత్రికి చెందిన జయచంద్ర ఇటీవల పులివెందుల మండలంలో ఓ యువతితో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. జయచంద్ర చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఎంగేజ్‌మెంట్ అయిన తర్వాత పెళ్లికి నిరాకరిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు.

పశుపోషణతో సుస్థిర ఆదాయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ రమణ

ప్రొద్దుటూరు టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పశుపోషణ ద్వారా రైతులు సుస్థిర ఆదాయం సాధించవచ్చని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జేవీ రమణ తెలిపారు. మంగళవారం శ్రీవెంకటేశ్వర పశువైద్యశాలలో హైదరాబాదుకు చెందిన ఐసీఏఆర్ అనుబంధ సంస్థ ఎన్ఏఆర్ఎం సహకారంతో సుస్థిర గ్రామీణ జీవనోపాధిలో పాడిపరిశ్రమ ఆవశ్యకత అనే అంశంపై అయిదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషణ ద్వారా రైతులు, యువత ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ వెంకటేశ్వరరావు సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ పశుపెంపకం, దేశవాలీ ఆవుల ప్రాముఖ్యత, జీవ ఎరువులు, రసాయనాలు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి మాట్లాడుతూ పశువులు, పశువుల ఉత్పత్తి ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని సూచించారు. ఎన్ఏఆర్ఎం శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ, పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ గీతాప్రియ, యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ కన్వీనర్ డాక్టర్ మాలకొండయ్య, పశువైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో విజయవాడ, అనంతపురం, కదిరి, బద్వేలు, మైలవరం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన 45 మంది యువ రైతులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురు అరెస్టు

కడపక్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం గంజికుంట కాలనీలో గత నెల 25న గొంతుముక్కుల వెంకటసుబ్బయ్యపై కత్తితో దాడి చేసిన కేసుకు సంబంధించి ఆరుగురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. కడప చిన్న చౌకు పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను వెల్లడించారు. కడప మాసా పేటకు చెందిన తాటిగిరి అనూష, పాలెం సుబ్బరాయుడు అలియాస్ సుబ్బన్న, సీకేదిన్నె మండలం నరసరామయ్యగారిపల్లెకు చెందిన సోమ ప్రశాంత్, సుగమాల నవీన్ అలియాస్ శిగనమాల నవీన్, సిబ్యాల సుబ్బరాయుడు, మాసా పేటకు చెందిన తాటిగిరి నిర్మలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కత్తి, బైకు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో మహిళ...

పులివెందుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో కరుణ కుమారి అనే మహిళను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ చాంద్ బాష తెలిపారు. పట్టణంలోని గుంతబజార్‌లో నివాసం ఉంటు న్న ఒంటరి మహిళ అయిన హసీనా జూలై 1వ తేదీ హత్యకు గురయ్యారు. ఈ కేసులో నిందితురాలుగా ఉన్న కరుణకుమారి అనే మహిళను సోమవారం అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు.

1229 మంది నిరుపేద పిల్లల గుర్తింపు

- అందరికీ ఆధార్ రిజిస్ట్రేషన్ : జడ్జి

కడప రూరల్, జూలై 22: నిరుపేద పిల్లల ఆధార్ కోసం సర్వే నిర్వహించి 1229 మందిని గుర్తించామని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో నిరుపేద పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సాతి కమిటీ మెంబర్స్‌తో జిల్లా వ్యాప్తంగా నిరుపేద పిల్లల ఆధార్‌కోసం సర్వే నిర్వహించి ఆధార్ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతోందని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి తగు చూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీ నాయుడు, రాయచోటి రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ప్యానల్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు

26న బండలాగుడు పోటీలు

సీకేదిన్నె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26 శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా అప్పరాజుపల్లె అభయహస్త ఆంజనేయస్వామి దేవాలయం వద్ద కేటగిరి ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.40,116, రెండో బహుమతి రూ.30,116, మూడో బహుమతి రూ.20,116, నాలుగో బహుమతి రూ.15,116, ఐదో బహుమతి రూ.10,116, 6వ బహుమతి రూ.6,116, 7వ బహుమతి రూ.5,116 అందించనున్నట్లు తెలిపారు. ఎద్దుల యజమానులు శనివారం ఉదయం 11 గంటలలోపు పేర్లు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి మృతి



రాహుల్‌రామిరెడ్డి (ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి-జూబ్లీనగర్ గ్రామాల మధ్య రోడ్డుపై కారు అదుపుప్పి బోల్తాపడిన ఘటనలో కడపకు చెందిన వైద్య విద్యార్థి ఏటూరి రాహుల్ రామిరెడ్డి (24) దుర్మరణం చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురు వైద్యవిద్యార్థులకు గాయాలయ్యాయి. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.... కడపకు చెందిన ఏటూరి రాహుల్‌రామిరెడ్డి, గుంటూరులోని శ్యామలనగర్‌కు చెందిన మోపిదేవి జయంత్, కర్ణాటకలోని రాయ్‌చూర్ జిల్లా చిందంటౌన్‌కు చెందిన కడియ వినయ్ చౌదరి, హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు చెందిన ఎం.పృథ్వీరాజ్, సిద్దిపేటలోని మోయిన్‌పురాకు చెందిన బి.పృథ్వీరాజ్ కరీంనగర్‌లోని ప్రతిమ వైద్య కళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కళాశాలకు చెందిన హాస్టల్‌లోనే ఉంటున్నారు. సోమవారం సెలవు కావడంతో ఐదుగురు కరీంనగర్‌లోని బొమ్మకల్ శివారులో ఉన్న చల్మెడ వైద్య కళాశాలలో స్నేహితులను కలిసేందుకు ఉదయం 10 గంటలకు కారులో వెళ్లారు. తిరిగి అదేకారులో రాత్రి 1:30 గంటలకు ప్రతిమ కళాశాలలోని హాస్టల్‌కు బయ ల్దేరారు. జూబ్లీనగర్ ఎల్లమ్మ దేవాలయం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొని బోల్తాపడింది. దీంతో కారులో వెనకవైపున కూర్చు న్న రాహుల్ రామిరెడ్డి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న జయంత్‌తో పాటు మిగతావారికి స్వల్పగాయాల య్యాయి. గాయపడ్డ వారు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. రాహుల్‌రామిరెడ్డి సోదరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వెనుకంజలో చిత్తూరు, కడప జట్లు

కడప స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ పోటీలలో భాగంగా వివిధ జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లలో మంగళవారం చిత్తూరు, కడప జట్లు వెనుకంజలో సాగుతున్నాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 66.3 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో చిత్తూరు బౌలర్ రాకేష్‌సాయి 6 వికెట్లు పడగొట్టారు. అనంతరం చిత్తూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. ఇందులో ఎంఎస్ అక్తర్ 47 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో చిత్తూరు జట్టు మరో 146 పరుగుల వెనుకబడి వుంది.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు- కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు 69.2 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో కడప బౌలర్ గైబు 6 వికెట్లు సాధించడం విశేషం. అనంతరం కడప జట్టు రెండో ఇన్నింగ్స్‌లో రెండవరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 95 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది. ఇందులో జయప్రణవశాస్త్రి 13 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. మరో 59 పరుగుల వెనుకంజలో కడప జట్టు ఎదురీదుతోంది.

ప్రతి నిరుపేదనూ ఆదుకోవడమే లక్ష్యం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే నల్లారి



సాంబశివకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి నిరుపేద కటుంబాన్ని ఆదుకోవడమే సీఎం నారా చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగిరిపల్లెలో వాల్మీకిపురం టీడీపీ కార్యకర్త సాంబశివకు రూ.78వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, నాయకులు కృష్ణారెడ్డి, సయ్యద్‌బాషా, రాజగోపాల్, ఆలి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిరంతరం సీఎం సహాయ నిధి

కలికిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల వ్యాధులకు గురై ఆరోగ్యశ్రీలో అవకాశం లేకుండా చికిత్స పొందుతున్న బాధితుల కోసం సీఎం సహాయ నిధి నిరంతరం అండగా వుంటుందని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. నగరిపల్లెలో బాధితులకు మంజూరైన సీఎం సహాయనిధి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. రూ.30,46,986 చెక్కులను 40 మందికి పంపిణీ చేశారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సంబంధిత అధికారులకు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల మండల టీడీపీ అధ్యక్షులు, నేతలు, కార్యకర్తలు, బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికీ మంచి నీరు

- టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



గోపిదిన్నెలో తాగు నీటి కుళాయిని ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె, జూలై 22(ఆంధ్రజ్యోతి): జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా సురక్షిత మంచి నీటిని అందిస్తామని టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె హరిజనవాడలో రూ.9.85లక్షలతో జల్‌జీవన్‌లో ఏర్పాటు చేసిన మంచి నీటి కుళాయిలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సురక్షిత మంచి నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జల్ జీవన్ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసి, నిధులను దుర్వినియోగం చేసిందన్నారు. ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే జల్ జీవన్ ద్వారా గ్రామాల్లోని ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి మంచి నీటిని అందించామన్నారు. తెలుగు యువత పార్లమెంటు ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర, పార్లమెంటు బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సోముశేఖర్, ఉత్తమ్‌రెడ్డి, రమణారెడ్డి, జగదీష్, భాస్కర్, జయరాంరెడ్డి, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత కొరవడితే చర్యలు

పీలేరు ప్రత్యేకాధికారి క్రిష్ణకిషోర్



రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి క్రిష్ణకిషోర్

పీలేరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థుల భోజనంలో నాణ్యత కొరవడితే చర్యలు తప్పవని పీలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమల అధికారి క్రిష్ణకిషోర్ హెచ్చరించారు. మంగళవారం పీలేరు పట్టణం యల్లమందక్రాస్‌లోని బీసీ బాలుర హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన నిత్యం అందించే భోజనం మెనూపై, అందుతున్న వసతులపై ప్రత్యేకంగా విచారించారు. గదుల శుభ్రత, మరుగుదొడ్లు, బాత్‌రూమ్స్, కిచెన్, హాస్టల్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం హాస్టళ్లలో మంచి వసతులు కల్పిస్తోందని చెప్పారు. ఆయన వెంట పీలేరు ఎంపీడీఓ శివశంకర్, పంచాయతీ కార్యదర్శి శివాజీ, హాస్టల్ వార్డన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మిరెడ్డిపల్లెలో తీవ్ర తాగునీటి ఎద్దడి

- వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తీసుకొస్తున్న మహిళలు



వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తీసుకొస్తున్న మహిళలు

పెద్దతిప్పసముద్రం జూలై 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె లో 20 రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని గ్రామస్తులు పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు, సర్పంచులకు ఎన్నిమార్లు విన్నవించినా ప్రయోజనం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు అందించే పంచాయతీ బోరు మరమ్మతులకు గురవడంతో గ్రామంలో తీవ్ర నీటి సమస్య తలెత్తిందని, గత్యంతరం లేక ప్రజలు స్థానిక వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నామని, వ్యవసాయ బోర్ల వద్దకు నీటి కోసం వెళితే రైతులు తమ బోర్ల వద్దకు రావద్దని అంటున్నారని వాపోయారు. మూడు రోజుల కిందట నీటి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారులను ఆశ్రయించామని, బోరుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కేరళ మాజీ సీఎంకు ఘన నివాళి



అచ్యుతానందన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మదనపల్లె అర్బన్, జూలై 22ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం సీపీఎం మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వీఎస్ అచ్యుతానందన్‌కు సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అచ్యుతానందన్ చిత్ర పటానికి పూలమాల వేసి జోహర్లు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ పార్టీలో ఎనిమిదన్నర దశాబ్దాలు సీపీఎంతో అనుబంధం ఉందన్నారు. కేరళలో కమ్యూనిస్టు ఉద్యమ స్థిరత్వానికి ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నాగరాజు, నరసింహులు, రాజు, సీఐటీయూ నేతలు రాజశేఖర్, రామకృష్ణ, రాము, నారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు గోపాల్, అరవింద్, శంకరమ్మ, తులసమ్మ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తలు సూచించిన ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్





పెద్దతిప్పసముద్రం ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్ - గండబోయనపల్లె హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫి

పెద్దతిప్పసముద్రం జూలై 22 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపట్ల గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్ సూచించారు. మంగళవారం పెద్దతిప్పసముద్రం ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ఆస్పత్రిలో పలు రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై విచారించారు. సిబ్బంది హాజరు తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల, జ్వరాలపై ఆయా గ్రామాల్లో ఉన్న వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని, నిత్యం వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో, నీటి తొట్టెల్లో, గుంతల్లో దోమ లార్వా వ్యాప్తి చెంది జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, మురికి కుంటల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వేస్ట్ ఆయిల్ బాయిల్స్ వేయించి తగు జాగ్రత్తలు పాటించి లార్వా వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది తరచూ పర్యటిస్తూ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న ల్యాబ్, డెలివరీ గదిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్తానీ, డాక్టర్ అభిలాష్, డాక్టర్ శంకర్, ప్రభాకర్, ప్రవీణ్, శాంతి, రామకృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, సూపర్‌వైజర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గండబోయనపల్లె జడ్పీ హైస్కూల్‌లో...

వాల్మీకిపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణలో విద్యార్థుల పాత్ర కీలకమని మండల డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫి పేర్కొన్నారు. మంగళవారం చింతపర్తి పీహెచ్‌సీ పరిధి గండబోయనపల్లె జడ్పీ హైస్కూల్‌లో అవగాహన నిర్వహించారు. సీజనల్‌గా వ్యాపించే డెంగీ, మలేరియా, అతిసార తదితర జబ్బుల పట్ల అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ తాగే నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. జ్వరాలు వచ్చిన తక్షణం ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని తెలియజేశారు. ముఖ్యంగా విద్యార్థులు చేతుల పరిశుభ్రత పాటించినప్పుడే వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రెడ్డిమోహన్, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి



రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న డీఏఓ శివనారాయణ

కలకడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితులతో వేరుశనగకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని డీఏఓ శివనారాయణ రైతులకు సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మంగళవారం కదిరాయచెరువు, నడిమిచెర్ల గ్రామాల రైతులతో మాట్లాడుతూ వచ్చే నెలాకరి వరకు కంది, ఉలవ, ఆముదాలు సాగు చేయవచ్చన్నారు. తెగుళ్ల తాకిడిని తట్టుకునే కంది సాగుపై ఆసక్తి ఉన్నవారు రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు పొంది ఎకరానికి నాలుగు కిలోలు వాడాలని సూచించారు. ఐదుగురు రైతులు గ్రూప్‌గా ఏర్పడి మందుల పిచికారికి ఉపయోగపడే కిసాన్ డ్రోన్ రాయితీతో పొందవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన వారు సమీప రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అనంతరం వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏడీఏ మజీద్‌అహ్మద్, ఏఓలు శ్రీనివాస్, నవంత్‌భాబు, సర్పంచ్ లక్ష్మీప్రసన్న, కమల్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ



మహిళా పోలీసులతో సమావేశమైన డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సమాజంలో సైబర్ నేరాలపై మహిళా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ మహేంద్ర సూచించారు. డీఎస్పీ కార్యాలయంలో స్థానిక వన్, టూ, తాలుకా పరిధి మహిళా పోలీసులతో ఆయన మాట్లాడుతూ సమాజంలో సామాజిక దురాచారాలు, సైబర్ నేరాలు, మహిళలు, పిల్లలకు సంబంధిత సమస్యలపై వివరాలు తెలుసుకుని మహిళా పోలీసులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మహిళలు, పిల్లల భద్రతను పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిపై అవగాహన కల్పించడం, బాధితులకు సాయపడడం అంశాలపై మహిళా పోలీసులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



రామారావుపల్లెలో పశువులకు రోగ నిరోధక టీకాలు వేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ సాధిక్ తెలిపారు. మంగళవారం గ్యారంపల్లె పంచాయతీ పరిధిలోని రామారావుపల్లెలో టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఈ నెలాఖరు వరకూ మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తామని చెప్పారు. బొబ్బల వ్యాధి బారినపడి పశువులు పడుతున్నాయని తెలిపారు. ముందస్తుగా పాడి రైతులు విధిగా బొబ్బల టీకాలు వేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జేవీలో శంకరయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

మదనపల్లెకు చేరిన ఢిల్లీ పాదయాత్ర



మదనపల్లె అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ యాదవుల పేరును మిలిటరీ బెటాలియన్‌కు పెట్టాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఢిల్లీ పాదయాత్ర మదనపల్లెకు చేరింది. 1960లో ఇండియా, చైనా మధ్య జరిగిన యుద్ధంలో అమరులైన భారతీయ యాదవుల పేరును బెటాలియన్‌కు పెట్టాలని కాశీ నుంచి కన్యాకుమారి మీదుగా ఢిల్లీకి యాదవులు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్రఅధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో బీసీలు మదనపల్లెకు స్వాగతం పలికారు. అన్నమయ్య సర్కిల్ నుంచి అనప గుట్టలోని శ్రీకృష్ణదేవాలయం వద్దకు ర్యాలీ నిర్వహించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. పట్టణంలోని మూడో వార్డులో సుపరిపాలన-తొలి అడుగులో ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఇచ్చిన హామీల మేరకు సూపర్‌సిక్స్ పథకాల అమలులో సీఎం చంద్రబాబు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించనున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బళ్లాపురంపల్లెలో...

తంబళ్లపల్లె, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందడం సాధ్యమని టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి అన్నారు. బళ్లాపురంపల్లె, ఉప్పులూరివాండ్లపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు చేపట్టారు. టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, వీరాంజనేయులు, రామ్మోహన్‌రెడ్డి, పురుషోత్తం గ్రామాధ్యక్షులు అశోక్, రెడ్డప్పనాయుడు, మహేష్, శివకృష్ణ, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, తెలుగు యువత నరసింహులు, మధు, వికలాంగ అధ్యక్షుడు రామాంజులు, నరేంద్ర పాల్గొన్నారు.


మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలి



హమాలీలతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతున్న సీపీఐ నేతలు

పీలేరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సివిల్ సప్లైస్ పాయింట్లలో పని చేస్తున్న హమాలీలకు ప్రతి నెలా మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలని సీపీఐ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి నెలా జీతాల చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ స్టాక్ పాయింట్ వద్ద హమాలీలతో కలిసి నిరసన చేపట్టిన సీపీఐ నేతలు సాంబశివ, టీఎల్ వెంకటేశ్ మాట్లాడుతూ సివిల్ సప్లైస్ డీటీలు బిల్లులు ఆలస్యంగా పెడుతున్నందున హమాలీలకు జీతాలు ఆలస్యంగా వస్తున్నాయన్నారు. ఈ నెలలో 22 రోజులు గడిచినా జీతాలు అందకపోవడం అందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం హమాలీల గురించి పట్టించుకుని వారికి మొదటి వారంలో జీతాలు అందేలా చూడాలన్నారు. జీతాలతోపాటు పెండింగ్ యూనిఫాం కుట్టు కూలీ కూడా మంజూరు చేయాలని వారు కోరారు. ఏఐటీయూసీ నేతలు నరసింహులు, నాగరాజు, సిద్దిరాజు, సుబ్రహ్మణ్యం, మునిరత్నం, రత్నయ్య పాల్గొన్నారు.

దోమల నియంత్రణతోనే మలేరియా నివారణ



చెరువులో చేప పిల్లలు వదులుతున్న అధికారులు

పీలేరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): దోమల నియంత్రణతోనే మలేరియా వ్యాధిని నియంత్రించవచ్చని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. దోమల సంతతి నివారణలో భాగంగా బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవవడ్డిపల్లె చెరువులో 'గంబూషియా' చేప పిల్లలను వదిలారు. చెరువుల్లోని దోమల లార్వాలను ఆహారంగా తీసుకునే గంబూషియా చేపల కారణంగా వాటి ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. తద్వారా మలేరియా నియంత్రణలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీలేరు మలేరియా సబ్-యూనిట్ అధికారి విద్యాసాగర్, తలపుల పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు మనోహర్, శివప్రసాద్, వెంకటరత్నం, షామున్నీసా, ఆశా కార్యకర్తలు అమరావతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

మదనపల్లె, జూలై 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నెలరోజుల పాటు మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె డిమాండ్లలో ఒక అంశాన్ని పరిష్కరిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కార్మికులకు అదనంగా రూ.3వేలు వేతనం పెంచుతున్నట్లు ప్రకటించింది. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ కార్మికులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు.

విధుల్లో చేరిన కార్యదర్శులు

నిమ్మనపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో బదిలీపై వచ్చిన కార్యదర్శులు పూర్తి స్థాయిలో విధుల్లో చేరినట్లు ఎంపీడీఓ రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొత్తం పది పంచాయతీల్లో రాచవేటివారిపల్లి కార్యదర్శిగా రజిత, కొండయ్యగారిపల్లి కార్యదర్శిగా చిరంజీవి, బండ్లపై కార్యదర్శిగా మహ్మద్, నిమ్మనపల్లి-1 కార్యదర్శిగా వెంకటరమణారెడ్డి, నిమ్మనపల్లి-2 కార్యదర్శిగా జనీఫర్‌రాణి, అగ్రహారం కార్యదర్శిగా రెడ్డిప్రసాద్, ముష్టూరు కార్యదర్శిగా రాజశేఖర్ నాయక్, తవళం, వెంగంవారిపల్లి కార్యదర్శిగా గౌతమి, రెడ్డివారిపల్లి-1 కార్యదర్శిగా గాయత్రి, రెడ్డివారిపల్లి-2 కార్యదర్శిగా నాగభూషణం, సామకోటవారిపల్లి కార్యదర్శిగా నౌరీన్ బాధ్యతలు చేపట్టారు.

వివాహాలకు అనుమతి లేదు

పెద్దమండ్యం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయ పార్టీల, వివాహ, శుభ, అశుభ కార్యక్రమాలకు అనుమతులు లేవని విద్యాశాఖ వెల్లడించినట్లు పెద్దమండ్యం ఎంఈఓ మనోహర్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రారంభించిన తరవాత గానీ, తెరవక ముందుగానీ, సెలవు రోజుల్లో గానీ ఆ కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల్లో నింబంధనలు ఉల్లంఘిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎంఈఓ హెచ్చరించారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలు

పెద్దమండ్యం, జూలై 22(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభమైనట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు వెల్లడించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు 90 శాతం మంది బదిలీ అయినట్లు తెలిపారు. రెండు రోజుల్లో బదిలీలు, కొత్తగా చేరికల ప్రక్రియ పూర్తి కానున్నట్లు తెలిపారు. మంగళవారం సచివాలయ ఉద్యోగుల బదిలీలతో ఎంపీడీఓ కార్యాలయం కిటకిటలాడింది.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

తంబళ్లపల్లె, జూలై 22(ఆంధ్రజ్యోతి): పకృతి సేద్యంతో పండించిన ఆహార ఉత్పత్తులతోనే ఆరోగ్యకరమని పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ అన్నారు. గుండ్లపల్లె సచివాలయంలో అజీమ్ ప్రేమిజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించారు. కందులు, అలసందలు, అనుములు, కిచెన్ గార్డెన్ విత్తనాలైన బెండ, కాకర, ముల్లంగి, మటిక్కాయ, పాల, తోటకూరలు, మెంతి ఆకు తదితర విత్తనాలను ఎంపీడీఓ థామస్ రాజ చేతుల మీదుగా రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. పకృతి వ్యవసాయం కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రంజిత్, పోర్డు సంస్థ సిబ్బంది నరసింహులు, రమణ, సుభాషిణి, సంపూర్ణ అనిత, రైతులు పాల్గొన్నారు.


హైరిస్క్ గర్భిణుల పట్ల జాగ్రత్తగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న డివిజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్

ములకలచెరువు, జూలై 22(ఆంధ్రజ్యోతి): హైరిస్క్ గర్భిణుల పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ డివిజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ఆదేశించారు. ములకలచెరువు ప్రభుత్వాస్పత్రిని మంగళవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు, హైరిస్క్ గర్భిణుల రిజిస్టరు, పీఎం సురక్ష అభియాన్ రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో డాక్టర్లు జాహ్నవి, రేష్మా, అహమ్మద్, లోకేష్, టీబీ సూపర్‌వైజర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

పీలేరు ఆస్పత్రికి బల్లల వితరణ



బల్లల వద్ద మానవత సంస్థ సభ్యులు

పీలేరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి మానవత సంస్థ సభ్యులు రూ.40 వేలు విలువజేసే 10 బల్లలను వితరణగా అందజేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు కుర్చీలు ఉపయోగపడతాయని ఆస్పత్రి సూపరింటెంట్ చంద్రశేఖర్ తెలియజేశారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, నేతలు ఆస్పత్రి అభివృద్ధికి తమ వంతు సాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు శెట్టిసుబ్రహ్మణ్యం, బీవీ రమేశ్, కృష్ణమూర్తి, పోతంశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

సమాజంలో రాణించాలి

మదనపల్లె అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించాలని వక్తలు అన్నారు. మదనపల్లె బ్యాంక్ ఆఫ్ బరోడా 118వ వ్యవస్థాపక దినోత్సం సీటీఎం గ్రామంలోని మహతి ఫార్మసీ కళాశాలలో నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్యార్థులకు ఫార్మసిటికల్స్‌పై సంపూర్ణ అవగాహనను పెంపొందించడానికి పోటీలు నిర్వహించినట్లు కళాశాల ఛైర్మన్ అమరనాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను. బహుమతులు అందించారు. కార్యక్రమంలో సెక్రటరీ శ్రీవాణి, కోటిరెడ్డి, కళాశాల సిబ్బంది, బ్యాంకు ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.